విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily

సంపుటి : 4 సంచిక :148 ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ గురువారం 15 అక్టోబర్ 2026 పేజీలు : 08 వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




# మోగిన ఎన్నికల నగారా



**28న కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగరపంచాయతీలకు పోలింగ్**

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఈమేరకు షెడ్యూల్ విడుదల**

**రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు ప్రకటించారు.**

**అమరావతి**

రాష్ట్రంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరం రానే వచ్చింది. స్థానిక సమరానికి సంబంధించిన పూర్తి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా విడుదల చేశారు. ఈ రోజు నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై, డిసెంబరు 2వ తేదీ వరకు సుదీర్ఘంగా కొనసాగనుంది. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ, మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు ప్రకటించారు.

వివరాలు 2లో..



## సౌదీలో దాడులు వెంటనే ఆపాలి

- ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు'
- భారతీయులకు కేంద్రం అడ్వైజరీ
- హూతీ తిరుగుబాటు దారులు సౌదీలోని పౌర మౌలిక సదుపాయాలపై చేస్తున్న దాడుల్ని భారత్ ఖండించింది
- అక్కడి భారతీయులకు ఎంఈఏ కీలక మార్గదర్శకాలు జారీ



## చైనాతో సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే వాస్తవాధీన రేఖ స్థిరంగా ఉండాలి

- సరిహద్దుల్లో ఎటువంటి అశాంతి చెలరేగినా దానికి పర్యవసానాలు ఉంటాయి
- విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం
- రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణ సరిహద్దు వద్ద శాంతితోనే ముడిపడి ఉన్నాయి

## జంతర్‌మంతర్ భారత ప్రజలది

- సీజేపీ నేతల కస్టడీపై విపక్షాలు ఫైర్
- సీజేపీ కార్యకర్తల జైలుకు పంపడంపై విపక్షాలు ఆగ్రహం
- యువతను జైలుకు పంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించాయి.





## విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.

అంతరాలయంలో పూజల అనంతరం అర్చకులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం

ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

సరస్ మేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు



## ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..

- కొత్త ఆందోళనకు అభిజీత్ దీప్కే పిలుపు..
- సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో కార్యక్రమం
- నిరసనకు 'లెహ్రా దో తిరంగా' పేరు..
- సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాల అరెస్టుకు నిరసనగా కార్యక్రమం
- అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల
- స్థానికంగా తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే పిలుపు

## 2,721 ఉపాధ్యాయ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల



ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం మరో అవకాశం

2,721 పోస్టులతో డీఎస్సీ-2026 ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది.

**అమరావతి**

ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. 2,721 పోస్టులతో డీఎస్సీ-2026 ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇందులో 350 ప్రత్యేక విద్య పోస్టులు ఉన్నాయని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకూ మెరుగైన విద్య, వ్యక్తిగత శ్రద్ధ అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లోనే ఉంటుందని కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తామని లోకేశ్? వెల్లడించారు. డీఎస్సీ

వివరాలు 2లో..



## దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోంది

- అక్టోబర్ 14 నుంచి 16 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న 'బృహత్తర భారత్
- ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు'ను ఉద్దేశించి పంపిన సందేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

## స్థానిక ఎన్నికల్లో పోటీపై టీడీపీ, జనసేన చర్చలు సఫలం

- 2 రోజుల్లో జాబితా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై సీఎం చంద్రబాబుతో జనసేన నేతల సమావేశం
- ఎన్నికల్లో పోటీపై టీడీపీ, జనసేన చర్చలు సఫలమయ్యాయని ఎమ్మెల్యే బొలిశెట్టి తెలిపారు.
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిగానే పోటీ చేస్తున్నాం
- బలంగా ఉన్నచోట గెలవాలని చంద్రబాబు చెప్పారు



**అమరావతి**

స్థానిక ఎన్నికల్లో కూటమి సీట్ల సర్దుబాటు పంచాయితీకి తెరపడింది. మేయర్ పీఠాల దగ్గర మొదలైన చర్చలు అభ్యర్థుల ప్రకటన దిశగా చేరాయి. సీట్ల కోసం కొట్టుకుంటున్నారన్న సంకేతాలు ఇవ్వకుండా ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా కూటమి పార్టీల నేతలు సర్దుబాటు చేసుకున్నారు. సీఎం చంద్రబాబుతో జనసేన నేతల సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా చంద్రబాబుకు జనసేన నేతలు ధన్యవాదాలు తెలిపారు. భేటీ

వివరాలు 2లో..

# మోగిన ఎన్నికల నగారా

-మొదటిపేజీ తరువాయి

పురపాలక (మున్సిపల్) ఎన్నికల షెడ్యూల్ : రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాల్టీలు, 10 నగర పంచాయతీలకు అక్టోబరు 28న పోలింగ్ నిర్వహించనున్నారు.
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: అక్టోబరు 18
నామినేషన్ల పరిశీలన: అక్టోబరు 19
నామినేషన్ల ఉపసంహరణ: అక్టోబరు 21
పోలింగ్ తేదీ: అక్టోబరు 28
ఫలితాలు: అక్టోబరు 30

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ : పరిషత్ పోరుకు సంబంధించి ఈ నెల 19వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. నవంబరు 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.
ఎన్నికల నోటిఫికేషన్: అక్టోబరు 19
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: అక్టోబరు 23
నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: అక్టోబరు 27
పోలింగ్ తేదీ: నవంబరు 3
ఫలితాల వెల్లడి: నవంబరు 5

రాశీఖ్రీ దీశీఎఎ జుశ్రీవఝఅశీఅం 2026

మూడు విడతల్లో పంచాయతీల సమరం : గ్రామ పంచాయతీలకు 3 విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 26, 29, డిసెంబరు 2వ తేదీల్లో పోలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

మొదటి విడత :
నోటిఫికేషన్: నవంబరు 13
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: నవంబరు 17
నామినేషన్ల ఉపసంహరణ గడువు: నవంబరు 21
పోలింగ్ తేదీ: నవంబరు 26

రెండో విడత :
నోటిఫికేషన్: నవంబరు 18
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: నవంబరు 20
నామినేషన్ల ఉపసంహరణ గడువు: నవంబరు 24
పోలింగ్ తేదీ: నవంబరు 29

**మూడవ విడత :**
నోటిఫికేషన్: నవంబరు 19
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: నవంబరు 23
నామినేషన్ల ఉపసంహరణ గడువు: నవంబరు 27
**పోలింగ్ తేదీ: డిసెంబరు 2**

మొత్తంగా ఈ రోజు నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి ఉండనుంది. షెడ్యూల్ విడుదల కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై కసరత్తులు చేస్తున్నాయి.

# పులివెందుల వైసీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీల

**కడప :** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ, రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. తన సొంత అడ్డా పులివెందులకు అభ్యర్థిని ఖరారు చేశారు. పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ వైయస్ఆర్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ మనోహర్ రెడ్డి సతీమణి వైఎస్ ప్రమీలమ్మ పేరును జగన్ అధికారికంగా ప్రకటించారు. ఈ సారి కుటుంబసభ్యులకు కాకుండా బయట వారికి చాన్సిస్తారని ప్రచారం జరిగినా.. అలాంటి ధైర్యం చేయలేకపోయారు. మనోహర్ రెడ్డి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు మనోహర్ రెడ్డి.. జగన్‌కు బాబాయ్ వరుసవుతారు. అటు జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి వైపు నుంచి కూడా వీరికి బలమైన కుటుంబ బాంధవ్యాలు ఉన్నాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా పులివెందుల స్థానిక రాజకీయాలు, గ్రామీణ పంచాయతీల నుంచి మున్సిపాలిటీ వరకు అంతా మనోహర్ రెడ్డి కనుసన్నల్లోనే నడిచేది. వైఎస్సార్ హయాం నుంచే స్థానిక సంస్థల పెత్తనాన్ని గుత్తాధిపత్యంగా నడిపిస్తున్న ఆయన.. జగన్ కేంప్ కార్యాలయం, భారతి వ్యవహారాల్లోనూ తెరవెనుక కీలక చక్రం తిప్పుతూ వచ్చారు. పులివెందుల పురపాలక సంఘం చరిత్రను తిరగేస్తే.. ఈ దంపతుల చేతుల్లోనే స్థానిక అధికారం దశాబ్దాలుగా బందీ అయిందన్నది బహిరంగ రహస్యం. గతంలోనూ వైఎస్ ప్రమీలమ్మ పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. భర్త మనోహర్ రెడ్డి చక్రం తిప్పుతుంటే, భార్య ప్రమీలమ్మ చైర్‌పర్సన్ కుర్చీలో కూర్చుని నామమాత్రపు పాలన సాగించేవారు. మున్సిపాలిటీలో పనుల కేటాయింపులు, స్థానిక కాంట్రాక్టులు, వార్డుల నిర్వహణ అన్నీ



వీరి కనుసన్నల్లోనే సాగాయి . పులివెందుల మున్సిపాలిటీలో నిజమైన ప్రజాస్వామిక ప్రాతినిధ్యం గానీ, కొత్త నాయకత్వానికి అవకాశం గానీ దక్కలేదు. పార్టీలో ఏళ్ల తరబడి జెండాలు మోసి, కేసులు ఎదుర్కొన్న సామాన్య కిందిస్థాయి కార్యకర్తలకు ఎప్పుడూ కార్పొరేటర్ లేదా వార్డు మెంబర్ టికెట్లే మిగిలాయి తప్ప.. కీలకమైన చైర్‌పర్సన్ కుర్చీ మాత్రం మళ్లీ తిరిగి ప్రమీలమ్మ ముంగిట్లోనే వాలింది. కడప ఎంపీగా అవినాష్ రెడ్డి, అసెంబ్లీలో జగన్, ఇప్పుడు మున్సిపాలిటీలో బాబాయ్ భార్య ప్రమీలమ్మ.. ఇలా స్థానిక నుంచి పార్లమెంట్ దాకా అధికారం అంతా నాలుగు గోడల మధ్యే ఉండాలన్న జగన్ ఆధిపత్య మనస్తత్వాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలోనే మెజారిటీ గణనీయంగా తగ్గిపోయి సొంత గడ్డపైనే పట్టు సడలిన సంకేతాలు కనిపించినప్పటికీ.. జగన్ మాత్రం కనీస మార్పునకు సిద్ధపడలేదు. ఈ సారి ప్రత్యక్ష ఎన్నిక కావడంతో .. టీడీపీ బలమైన మహిళా అభ్యర్థిని నిలిపే అవకాశం ఉంది.

# జనసేన పార్టీ లోకి వంగవీటి రాధాకృష్ణ

## పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్





**మంగళగిరి, అక్టోబర్ 14:** దివంగత వంగవీటి మోహన రంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే శ్రీ వంగవీటి రాధాకృష్ణ కి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి జనసేన పార్టీ లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరేందుకు జనసేన కేంద్ర కార్యాలయానికి బుధవారం సాయంత్రం వచ్చిన వంగవీటి రాధాకృష్ణ ని, పవన్ కళ్యాణ్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రాధాకృష్ణ తన అనుచరులను పవన్ కళ్యాణ్ కి పరిచయం చేశారు. ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడుతూ ప్రత్యేకంగా ఫోటోలు తీయించుకున్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాల కోసం కలసికట్టుగా పని చేద్దామని, ప్రజాసేవలో సమష్టి గా ముందుకు వెళదామని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.

## ధర్మానకు శీల పరీక్ష.. !

**శ్రీకాకుళం :** ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కీలకమైన శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వైసిపి ఏ విధంగా ముందుకు సాగుతుంది?. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ విధంగా ఫలితాన్ని తెచ్చుకుంటుంది? అనేది ఆసక్తిగా మారింది. కీలక మైన నాయకుడిగా గుర్తింపు పొందిన ధర్మాన ప్రసాదరావుకు ఈ ఎన్నిక ఒకరకంగా శీల పరీక్ష పెడుతుందనే వాదన బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా గత రెండున్నర ఏళ్ల కాలంలో వైసిపి తరఫున శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో పెద్దగా కార్యక్రమాలు ఏవి చేపట్టలేదు. కార్యకర్తలతో మాస్ స్పీచ్ ఒక్క కార్యక్రమంలో మాత్రమే ధర్మాన ప్రసాదరావు పాల్గొన్నప్పటికీ బలమైన ముద్రనైతే వేయలేకపోయారు. కానీ, పార్టీ పరంగా ధర్మాన తర్వాత ఇంకెవరూ లేరు అనే మాట వినిపిస్తున్న నేపథ్యంలో ఆయన శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ఏ విధంగా పార్టీని గెలుపు దిశగా అడుగులు వేసేలా చేస్తారు అన్నది ప్రశ్న. ప్రధానంగా కూటమిక్కడ బలంగా పనిచేస్తుంది. శ్రీకాకుళం నియోజకవర్గ కావచ్చు శ్రీకాకుళం జిల్లాలో కావచ్చు మొత్తంగా టిడిపి జనసేన ల ప్రభావం భారీగా కనిపిస్తోంది. – ఈ క్రమంలో బలమైన కూటమి పక్షాలను ఎదుర్కొని ఇక్కడ వైసిపి పాగా వేయాలి అంటే ధర్మాన ఇంతకు నాలుగింతల కృషి చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ ఎన్నికల్లో ధర్మాన గెలుపు దిశగా అడుగులు వేస్తే తప్ప వచ్చే ఎన్నికల నాటికి ఆయన ఇమేజ్ బలపడడంతో పాటు ఆయన ఓటు బ్యాంకు పెరిగే అవకాశాలు కూడా తక్కువగానే ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికిప్పుడు పరిస్థితిని చూస్తే కూటమికే శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో అనుకూలమైన వాతావరణం ఉంది. మాజీ ఎమ్మెల్యే గుండా లక్ష్మీదేవి కార్పొరేషన్ మేయర్ సీటు కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నం చేస్తున్నారు. దీనిని టిడిపికే కేటాయిస్తే గుండె లక్ష్మీదేవి విజయం సాధించడం సునాయాసం అవుతుంది అన్న వాదన కూడా వినిపిస్తోంది. ఇక వ్యక్తిగతంగా లక్ష్మీదేవికి ఉన్న మెజారిటీ మహిళా ఓటు బ్యాంకు మాజీ ఎమ్మెల్యేగా ఆమెకు ఉన్న గుర్తింపు కుటుంబ పరంగా ఉన్న ఇమేజ్ వంటివి కూడా కలిసి వస్తాయని అంటున్నారు. ఇవన్నీ దాటుకుని వైసీపీని ఇక్కడ గెలిపించడం కార్పొరేషన్ లో పాగా వేయటం అనేది ధర్మానకు శిల పరీక్షగా మారనుందని తెలుస్తోంది. మరి ఏం చేస్తారనేది చూడాలి.

## విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అంతరాలయంలో పూజల అనంతరం అర్చకులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి హోంమంత్రి అనిత, ఎంపీ కేశినేని చిన్ని, ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ స్వాగతం పలికారు. క్యూలైన్లలోని భక్తులకు నమస్కారం చేస్తూ రాష్ట్రపతి ముందుకు సాగారు.

అంతకుముందు దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి రాష్ట్రపతి ముర్ము చేరుకున్నారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడకు చేరుకున్నారు. రాష్ట్రపతి పర్యటన దృష్ట్యా అరగంటపాటు దర్శనాలు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లను ఆలయ అధికారులు పకడ్బందీగా చేపట్టారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దర్శనం అనంతరం ఇంద్రకీలాద్రిపై సామాన్య భక్తులకు యథావిధిగా దర్శనాలు కల్పిస్తున్నారు.

**సరస్ మేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**

రేపు(15న) పున్నమి ఘాట్‌లో నిర్వహించే సరస్ మేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలు, లఖ్‌పతి దీదీలతో కలిసి విందులో పాల్గొని మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయం నుంచి దిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సీఎస్ సాయిప్రసాద్ ఆదేశించారు. అలాగే 14, 15 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, నిమిషాల వారీగా నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు**

మరోవైపు ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు శ్రీమహా చండీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తున్నారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మహాలక్ష్మీ, మహాకాళీ, మహాసరస్వతీ కలిసిన త్రిశక్తి స్వరూపిణిగా మహాచండీ అమ్మవారు ఉద్భవించింది. ఈ అమ్మవారిలో అనేకమంది దేవతలు కొలువై ఉన్నారు. మహాచండీ రూపంలోని దుర్గమ్మను ప్రార్థిస్తే సర్వదేవతలను ప్రార్థించినట్టేనని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అమ్మవారి అనుగ్రహం వల్ల విద్య, కీర్తి, సంపదలు లభించి శత్రువులు మిత్రులుగా మారతారు. భక్తుల సంకల్పాలు నెరవేరి విజయం సిద్ధిస్తుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచే భారీ సంఖ్యలో తరలివస్తున్నారు.

## 2,721 ఉపాధ్యాయ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల



-మొదటిపేజీ తరువాయి

సిలబస్‌ను ఇప్పటికే వ్2ఎంఎ.ఖజూఎటం౦.అఅ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని నవంబర్ 3 లోగా పూర్తి స్థాయి నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

**జాబ్ క్యాలెండర్ ప్రకారం**

ఏటా డీఎస్సీ ప్రకటిస్తామని ఇచ్చిన హామీలో భాగంగా మంగళవారం రాత్రి డీఎస్సీ ప్రాథమిక (షార్ట్) నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, పురపాలక పాఠశాలల్లో 2,111 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు 350, సొసైటీల్లో ప్రిన్సిపల్, పీజీటీ, టీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులు 260 కలిపి మొత్తం 2,721 ఉద్యోగాల భర్తీకి మూడు వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేసింది. నవంబరు 3 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తుల స్వీకరణకు ముందే పాఠశాల విద్యాశాఖ పూర్తి స్థాయి నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. ఇందులో ఖాళీలు, రిజర్వేషన్లు, అర్హతల పూర్తి వివరాలను ప్రకటిస్తుంది. సాధారణ పోస్టులతో పాటు ఈసారి ప్రత్యేక విద్య టీచర్ ఖాళీలను భర్తీ చేయనున్నారు. మొదట ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 15న నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతున్నందున రెండు రోజులు ముందుగానే ప్రాథమిక నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది.

**కర్నూలులో 404 ఖాళీలు**

సాధారణ, ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులతో కలిపి అత్యధికంగా కర్నూలు జిల్లాలో 404 ఖాళీలు ఉన్నాయి. ఆ తర్వాత ప్రకాశంలో 291, వైఎస్సార్ కడపలో 227 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నారు. అత్యల్పంగా పార్వతీపురం మన్యంలో 15, విజయనగరంలో 18, పశ్చిమగోదావరిలో 20 పోస్టులు ఉన్నాయి.
సొసైటీలు, ఇతర యాజమాన్యాల్లో మొత్తం 260 పోస్టులున్నాయి. అందులో సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీలో ఉన్నవి 85 ఖాళీలు.
ప్రిన్సిపల్ పోస్టులు మల్టీ జోన్ కాగా పీజీటీ, టీజీటీ జోనల్ పోస్టులు. ఆదర్శ పాఠశాలల్లో టీజీటీ పోస్టులను జోన్ పరిధి పోస్టులుగా ఇటీవల స్థానిక కేడర్‌లో ప్రభుత్వం పేర్కొంది.

# పైడితల్లి అమ్మవారి నూతన దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం.

## చిట్టవలస గ్రామంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అచ్చెన్నాయుడు.





**కోటబొమ్మాళి, పెన్ సత్తా, అక్టోబర్ 14:** సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన చిట్టవలస గ్రామం లోని పైడితల్లి అమ్మవారి నూతన దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం భక్తి శ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర మహోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరి పై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, అమ్మవారి పునఃప్రతిష్ఠ మహోత్సవంలో గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలను పొందారు. తరతరాలుగా గ్రామ ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న పైడితల్లి అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ వేడుకలు గ్రామ ప్రజల్లో భక్తి భావాన్ని, ఐక్యతను మరింత పెంపొందించాయి. భక్తుల జయజయధ్వానాలు, సంప్రదాయబద్ధమైన పూజా కార్యక్రమాల మధ్య జరిగిన ఈ మహోత్సవం చిట్టవలస గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపింది. పైడితల్లి అమ్మవారి దివ్య ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థిని సంపతిరావు భారతమ్మ తో పాటు గ్రామ ప్రముఖులు మెట్ట సూర్యనారాయణ, కురుకుల శ్రీను, కురుకుల నారాయణరావు, మెట్ట ప్రసాదరావు, చింతాడ గౌరినాయుడు, దుంపల ముత్యాలరావు, బొడ్డేపల్లి వేణు, సంపతిరావు లోకనాథం మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆత్మగౌరవం, భద్రతకు ప్రాధాన్యత.. ఎమ్మెల్యే దగ్గుపాటి.

- నగరంలో పింక్ టాయిలెట్స్ కు భూమి పూజ.
- అహుడా ఆధ్వర్యంలో 30లక్షలతో పింక్ టాయిలెట్స్.
- చైర్మన్ టీసీ వరుణ్, ఎమ్మెల్సీ రమాదేవి తో కలిసి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.







**అనంతపురం, పెన్ సత్తా, అక్టోబర్ 14:** మహిళల ఆత్మగౌరవం, భద్రతే కూటమి ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యత అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి అన్నారు. అనంతపురం నగరంలో ఎప్పటి నుంచి ఏర్పాటు చేయాలనుకుంటున్న పింక్ టాయిలెట్స్ కు భూమి జరిగింది. నగరం లోని టవర్ క్లాక్ సమీపం లోని ప్రెస్ క్లబ్ ఎదురుగా ఫ్లై ఓవర్ కింద ఈ టాయిలెట్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(అహుడా) ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో వీటిని నిర్మించనున్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి వీటికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు అహుడా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నగరానికి వచ్చే మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగినులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యను తీర్చడమే ఈ పింక్ టాయిలెట్స్ ముఖ్య ఉద్దేశమన్నారు. బహిరంగ ప్రదేశాలలో మహిళలు ఇబ్బంది పడకుండా, వారి ఆత్మగౌరవాన్ని, వ్యక్తిగత గోప్యతను కాపాడేలా వీటిని నిర్మిస్తున్నామన్నారు. ఇవి కేవలం సాధారణ శౌచాలయాలు మాత్రమే కావని, మహిళలకు అవసర మైన ఆధునిక సదుపాయాలు, నిరంతర నీటి సరఫరా, మెరుగైన లైటింగ్ వ్యవస్థతో నిర్మిస్తున్నట్టు చెప్పారు. మహిళల రాకపోకలు ఎక్కువగా ఉండే కీలక మైన, రద్దీ ప్రాంతాలను గుర్తించి స్వచ్ఛభారత్ ద్వారా ప్రదేశాలలో టాయిలెట్స్ లను నిర్మిస్తున్నట్టు తెలిపారు. మరో వైపు అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మాట్లాడుతూ ఇప్పటికే అహుడాలో అనేక మార్పులు తీసుకొచ్చామన్నారు. అలాగే ఆ సంస్థ ద్వారా ఎన్నో విభిన్న కార్యక్రమాలు చేస్తున్నట్టు చెప్పారు. గతంలో టాయిలెట్స్ లేక మహిళలు పడే ఇబ్బంది గురించి తమ దృష్టికి వచ్చిందని, అందుకే ఇప్పుడు వీటిని నిర్మిస్తున్నట్టు చెప్పారు. మహిళలు ఎక్కడా ఇబ్బంది పడకుండా, ఆహ్లాదకర మైన వాతావరణంలో ఉపయోగించుకునేలా ఈ పింక్ టాయిలెట్స్‌లను నిర్మిస్తున్నామన్నారు. మహిళల భద్రత మాకు అత్యంత ముఖ్యమని, అందుకే ఇక్కడ నిరంతర రక్షణ, పూర్తి పారిశు ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక మహిళా సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా మారుస్తున్నారని టీసీ వరుణ్ తెలిపారు.

# నెరవేరిన మాజీ సైనికుల దశాబ్దాల కల.

- సైనిక్ భవన్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.
- టవర్ క్లాక్ వద్ద పాత తహసీల్దార్ కార్యాలయ ప్రాంతంలో సైనిక్ భవన్.
- రూ.1.60కోట్ల మాజీ సైనికుల నిధులతో భవన నిర్మాణానికి శ్రీకారం.
- మాజీ సైనికులకు అండగా ఉంటామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి.







**అనంతపురం, పెన్ సత్తా, అక్టోబర్ 14:** నగరం లోని మాజీ సైనికులు గత 20 నుండి 25 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సైనిక్ భవన్ కల సాకార మైంది. నగరం లోని టవర్ క్లాక్ సమీపంలో గల పాత తహసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో 1.60 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సైనిక్ భవన్ నిర్మాణ పనులకు బుధవారం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, సైనిక సంక్షేమ శాఖ అధికారులు, మాజీ సైనికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సరిహద్దుల్లో సేవలు అందించిన మాజీ సైనికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత రెండు దశాబ్దాలుగా సైనిక్ భవన్ కోసం మాజీ సైనికులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించి.. ఈ రోజు పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే మాజీ సైనికులు, అమర జవాన్ల కుటుంబాలు, వీరనారీలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు, అర్జీలు ఇచ్చుకునేందుకు ఈ భవనం ఒక కేంద్ర బిందువుగా మారుతుందన్నారు. మాజీ సైనికుల వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశాలు నిర్వహించుకోవడానికి, వారి సంక్షేమ కార్యక్రమాలను చర్చించుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ భవనాన్ని నిర్మించడం వల్ల రవాణా పరంగా అందరికీ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు

# ఇన్నర్ రింగ్ రోడ్డుకు మరో రూ.6 కోట్లు.

- మిగిలిన 350 మీటర్ల నిర్మాణానికి నిధుల మంజూరు.
- నగరం రహదారి కనెక్టివిటీ మెరుగుదలకు మరో ముందడుగు.



**గుంటూరు, పెన్ సత్తా, అక్టోబర 14:** నగరంలో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సిఆర్డిఏ) రూ.6 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయడం పై గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేకేసీ కాలేజీ రోడ్డు (స్వర్ణ భారతి నగర్) నుంచి పెదపలకలూరు రోడ్డు వరకు ఫేజ్-3 కింద చేపట్టిన ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో మిగిలిన 350 మీటర్ల రహదారి పనులను పూర్తి చేసేందుకు ఈ నిధులను కేటాయించారని చెప్పారు. చైనేజ్ 3.900 నుంచి 4.250 వరకు ఉన్న ఈ రహదారి భాగం నిర్మాణానికి సంబంధించి ఏపీ సిఆర్డిఏ నిధుల నుంచి రూ.6 కోట్లను మంజూరు చేస్తూ కమిషనర్ విజయ్ రామరాజు 2026 అక్టోబర్ 13 న ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 పనులకు ఏపీ సిఆర్డిఏ ద్వారా మొత్తం 48 కోట్ల అంచనా వ్యయంతో శిల్పారామం నుంచి పెద పలకలూరు జంక్షన్ వరకు 4.25 కిలో మీటర్ల మేర అనుమతులు గత ఏడాది మంజూరయ్యాయి. ఆయా పనులకు గాను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, మంత్రి పి. నారాయణ, స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు తో కలిసి అప్పట్లోనే శంకుస్థాపన కూడా నిర్వహించారు. అయితే, అదనపు పనుల అవసరం ఏర్పడటంతో ప్రస్తుతం సుమారు 3.90 కిలో మీటర్ల మేర రహదారి నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి ఉండగా, మిగిలిన 350 మీటర్ల రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మిగిలిన 350 మీటర్ల రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అదనపు నిధుల అవసరాన్ని పరిగణన లోకి తీసుకుని, గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-××× పనులకు సంబంధించి కమిషనర్ అదనంగా 6 కోట్ల నిధులను మంజూరు చేశారు. అంతే కాకుండా, రహదారి నిర్మాణానికి ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి పనుల నిమిత్తం గుంటూరు నగరపాలక సంస్థ ఇప్పటికే 1.72 కోట్లను చెల్లించింది. ఈ చర్యల ద్వారా మిగిలిన రహదారి నిర్మాణ పనులను పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు మార్గం సుగమ మైంది. ఈ నిధుల మంజూరుకు సంబంధించి కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అక్టోబర్ 3 న రాసిన లేఖను ఉత్తర్వుల్లో ప్రస్తావించారు.

మిగిలిన రహదారి నిర్మాణ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల మధ్య రాకపోకలకు మరింత సౌలభ్యం కలగనుంది. గుంటూరు నగర రహదారి అనుసంధానతను మెరుగుపరిచే దిశగా ఈ నిధుల మంజూరు కీలక ముందడుగు కానుంది.

# రాష్ట్ర పతి ప్రారంభించనున్న సారస్ ఆజీవికా మేళ.

- సారస్ ఆజీవికా మేళ ఏర్పాట్లను పరిశీలించిన పెమ్మసాని, కేశినేని.







**గుంటూరు, పెన్ సత్తా, అక్టోబర్ 14:** రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగనున్న జాతీయ సారస్ ఆజీవికా మేళ - 2026 ను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ఎంపీ కేసినేని చిన్ని (శివనాథ్)తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ దేశం లోని పలు రాష్ట్రాలలో అందుబాటులో ఉండే హైయెస్ట్ క్వాలిటీ ఫుడ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ ఉత్పత్తులు అన్నింటిని ఈ సారస్ మేళాలో ప్రజలకు అందుబాటు లోకి తీసుకువచ్చారు. ఈ మేళా ద్వారా ఆంధ్రప్రదేశ్ కు చెందిన డ్వాక్రా మహిళలకు అత్యంత ప్రాధాన్యత కల్పించేలా ఏర్పాటు చేశాము. తయారుచేసిన ఉత్పత్తులను ఎలా బ్రాండింగ్ చేసి, ప్యాకింగ్ చేసి ఉత్పత్తులను రవాణాకు అనుగుణంగా తయారు చేసుకోవాలి?, అలాగే ఆన్లైన్ రిటైలర్స్ తో ఎలా అటాచ్ చేయాలి?, అనే తరహాలో ఇక్కడ ట్రైనింగ్ క్లాసెస్ కూడా ప్రతి రోజు జరుగుతూ ఉంటాయన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే డ్వాక్రా మహిళలకు ఈ సరస్ మేళా ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ధ్యేయంగా ఈ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఇలాంటి ఒక అద్భుత మైన కార్యక్రమానికి మన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన అతిథిగా విచ్చేస్తున్నారన్నారు. ఇలాంటి ఈ కార్యక్రమానికి విజయవాడ, గుంటూరు తో పాటు పరిసర ప్రాంతాల లోని, జిల్లాల లోని ప్రజలు కూడా విచ్చేసి ఇక్కడి రుచులను, ఉత్పత్తులను ఆస్వాదించవలసిందిగా కోరుతున్నామన్నారు. ఈ సరస్ మేళాను ఇక్కడకు తీసుకురావడానికి ఆసక్తి చూపిన ఎంపి కేశినేని చిన్ని కి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## నూకాంబికకు సప్త ప్రకార సేవ.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 14:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భాగంగా బుధవారం అమ్మవారికి సప్త ప్రకార సేవ ఘనంగా నిర్వహించారు. మళ్ల వెంకట్ బెనర్జీ, కాతా రామారావు, మండలం విష్ణువర్ధన్ రావు దంపతులు, కుటుంబ సభ్యులు అన్న సమారాదాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, జిల్లా సహాయ కమిషనర్ కే సుధారాణి, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

### భరిణికం లో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం.



**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 14:** మండలం లోని భరిణికం పంచాయితీలో, పెందుర్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆదేశాలు మేరకు మండల పార్టీ అద్యక్షులు కోన రామారావు ఆధ్వర్యం లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు (ఐడీ) కార్డులను పంపిణీ చేసారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు పయిల శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర ఎస్ఈసి మెంబర్ పి.ఎస్. రాజు చేతుల మీదుగా అందజేశారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన రూ.5 లక్షల బీమా అంశం నేపథ్యంలో పార్టీ ఐడీ కార్డుల ప్రాధాన్యతను నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ పెదిశెట్టి శేఖర్, పంచాయితీ ముఖ్య నాయకులతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థులను సిద్ధం చేయడం, గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాల పై చర్చించారు. ఎన్నికల కార్యాచరణ, గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, కార్యకర్తలు సమష్టిగా పనిచేయడం వంటి అంశాల పై సమాలోచనలు జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాఅధికార ప్రతినిధి చుక్క రాము నాయుడు, బొండా సతీష్, బొండా సత్యారావు, బొండా సత్యన్నారాయణ, నేతల అప్పారావు, బొండా కేశవ్, పోలవరపు నరేష్, దుర్గి నాయుడు, ప్రగడ పెంటా రావు, కడవల అప్పారావు, సమ్మింగ తాతారావు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

### విశాఖ సీఫుడ్ ప్రత్యేకతను ప్రపంచానికి చాటేలా స్టార్ చెఫ్ ఛాలెంజ్-2026.

సంబంధిత పోస్టర్ను ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి.



**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 14:** విశాఖపట్నం తీర ప్రాంత ఆహార సంస్కృతి, స్థానిక సముద్ర ఆహార వంటకాలు, సంప్రదాయ రుచులను ప్రోత్సహిస్తూ నగరాన్ని ప్రామాణిక సీఫుడ్ అనుభవాలకు ప్రత్యేక గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించనున్న 'ఫ్లేవర్స్ ఆఫ్ వైజాగ్- స్టార్ చెఫ్ ఛాలెంజ్-2026' కార్యక్రమ రెండో ఎడిషన్ పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి బుధవారం తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జిల్లా పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ఆశ), తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ (కేటా) సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సాగర్ నగర్ లోని సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ బీచ్ క్యాంపస్‌లో ఈ 16వ తేదీ ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం జరగనుంది. పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా టూరిజం అధికారిణి జె. మాధవి, డివిజనల్ మేనేజర్ జగదీష్, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి పవన్ కార్తీక్ ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# కైలాసగిరి పై పోలీస్ ఔట్ పోస్ట్ ప్రారంభం.

**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 14:** ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రముఖ పర్యాటక ప్రాంత మైన కైలాసగిరి పై పోలీస్ ఔట్ పోస్ట్ ను వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎం.ఎల్.ఏ (ఈస్ట్) వెలగపూడి రామకృష్ణ బాబు తో కలిసి ప్రారంభించిన నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి. ఈ సందర్భంగా బాగ్చి మాట్లాడుతూ గ్లాస్ బ్రిడ్జ్, రోప్ వే, శివ పార్వతులు విగ్రహం, 65 అడుగుల త్రిశూలం, డమరుకం, రోప్ వే వంటి పలు ఆకర్షనీయ మైన సందర్శనా ప్రాంతాలు కలిగి ఉన్న కైలాసగిరి పై పర్యాటకుల భద్రత నిమిత్తం ఒక పోలీస్ ఔట్ పోస్ట్ ను బుధవారం ప్రారంభించడం జరిగినదన్నారు. ఈ పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయుటలో ముఖ్య ఉద్దేశ్యం ఈ ప్రాంతాలలో ఏటువంటి ఆకతాయిల ఆగడాలకు అవకాశం లేకుండా, పర్యాటక ప్రాంతాలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా, ఆయా ప్రాంతాలలో నిరంతరం పోలీసింగ్ ఉండేలా చేయడం. అత్యవసర సమయాలలో పోలీసింగ్ అందుబాటులో ఉండే ఉద్దేశంతో ఈ ఔట్ పోస్టు పనిచేసేలా తగు సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరిగినదన్నారు. ఈ పోలీస్ ఔట్ పోస్ట్ ప్రారంభ కార్యక్రమం నందు ప్రజా ప్రతినిధులు, సీపీ తో పాటుగా డి.సి.పి-01 (ఎల్ఁడ ఓ) వి.ఎన్.మణికంఠ చందోలు, ఏ.సి.పి(ద్వారకా), ఏ.సి.పి(ట్రాఫిక్), ఆరిలోవ సీఐ(ఎల్ఁడ ఓ), ఆరిలోవ సీఐ(ట్రాఫిక్)ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







## కానిస్టేబుల్ పైలా మోహన్ అకాల మృతికి జిల్లా ఎస్పీ ప్రగాఢ సంతాపం.







ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు.

**దేవరపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 14:** అనకాపల్లి జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్బి) విభాగంలో విధులు నిర్వహిస్తూ, జిల్లా కలెక్టర్ కార్యాలయంతో సమన్వయ కర్తగా పనిచేస్తున్న 2009 బ్యాచ్ పోలీస్ కానిస్టేబుల్ పైలా మోహన్ (పీసీ 2090) తీవ్ర అనారోగ్యంతో బుధవారం ఉదయం తన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ?ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పైలా మోహన్ తన విధులను ఎంతో నిబద్ధత, అంకితభావంతో నిర్వహించారని, పోలీసు శాఖకు ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. వారి అకాల మరణం పోలీస్ విభాగానికి తీరని లోటని పేర్కొన్నారు. దివంగత మోహన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ?మృతునికి భార్య పైలా భవాని (38), కుమారులు పైలా భవేష్ (12 - 8వ తరగతి), పైలా కుషాల్ ప్రసన్న కుమార్ (9) ఉన్నారు. ?మోహన్ స్వగ్రామ మైన దేవరపల్లి మండలం, కొత్తపెంట గ్రామంలో పోలీస్ గౌరవ వందనంతో, అధికారిక ప్రభుత్వ లాంఛనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వి.బాబ్జీ రావు, సీఐలు ఎస్.బాల సూర్యరావు, కె.కృష్ణ జి.అశోక్ కుమార్, పి.రమేష్, ఎస్సై వి.సత్యనారాయణతో పాటు స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు పాల్గొని మోహన్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

# రోడ్డెక్కిన సింహాద్రి బూడిద.



- ప్రజారోగ్యం బుగ్గిపాలు.
- ప్రజలు ఆందోళన.



**పరవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 14:** ఎన్టిపిసి సింహాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పరిసర ప్రాంతాలలో రహదారులు బూడిద మైమయ్యాయి. రోడ్డెక్కిన బూడిద ప్రజా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తం అవుతుంది. దీంతో సింహాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేశారు. సింహాద్రి యాష్పాండు నుంచి వందలాది భారీ లారీలు నిత్యం జాతీయ రహదారుల కోసం బూడిదను తరలిస్తున్నాయి. దీంతో సింహాద్రి పరిసర రహదారులు బూడిదమయం అవుతున్నాయి. భారీ వాహనాల పై పరిమితికి మించి ఫ్లయాస్ రవాణా చేస్తుండడంతో రోడ్ల పై బూడిద జారి బురదమయం అవుతున్నాయి. వాహన చోదకులు ముఖ్యంగా ద్విచక్ర వాహనాల పై ప్రయాణిస్తున్న ప్రజలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సింహాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి జాతీయ రహదారుల సంస్థకు బూడిద రవాణా అవుతుంది. బూడిద రవాణా కాంట్రాక్టర్లతో రాజకీయ నాయకులు లోపాయికారి ఒప్పందాలు చేసుకోవడంతో ప్రజలకు ఈ దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. సింహాద్రి నుంచి రాష్ట్ర రహదారి గుండా ఎలమంచిలి, లంకెలపాలెం జాతీయ రహదారులకు బూడిద వాహనాలు పయనిస్తున్నాయి. లారీల పై బూడిదను తార్పల్లిన్తో కవర్ చేయాలన్న నిబంధనలను పాటించకపోవడంతో రహదారులు వెంబడ బూడిద చల్లుకుంటూ లారీలు వెళుతున్నాయి. దీంతో రహదారులన్నీ బూడిదమయమయ్యాయి. ఈ బూడిద వర్షాలకు బురదమయం, ఎండకు బుడిగమయం అవుతూ ప్రజలకు ప్రమాదాలు తెచ్చిపెడుతున్నాయి. బూడిద రవాణాలో రాజకీయ నాయకుల జోక్యం కారణంగా పర్యావరణ మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకుల జోక్యంతో ఫిర్యాదులను పర్యావరణ శాఖ అధికారులు బుట్ట దాఖలు చేస్తున్నారని ప్రజలు ఆందోళనకు సిద్ధమయ్యారు.

## ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు.

- ఏయూలోని స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్.
- చేపట్టాల్సిన చర్యల పై, బాధ్యతల పై జీవీఎంసీ కమిషనర్ ఇతర అధికారులకు ఆదేశాలు.





**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 14:** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 30 న జరగనున్న జీవీఎంసీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఏయూ సౌత్, నార్త్ క్యాంపస్‌లలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులతో కలిసి ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లు, కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, ఓట్ల లెక్కింపు రౌండ్ల వివరాలు, రిసెప్షన్ కేంద్రాలు, కంట్రోల్ రూముల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. లెక్కింపు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సౌత్ క్యాంపస్‌లో మూడు కౌంటింగ్ కేంద్రాలు, నార్త్ క్యాంపస్‌లో ఏడు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వసతులు, స్థల సౌకర్యాలు, సిబ్బంది విధుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, రౌండ్ల వారీగా లెక్కింపు నిర్వహణ, రికార్డుల నిర్వహణపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరిశీలనలో రిటర్నింగ్ అధికారి దయానిధి, ఏఆర్వో అనిత, విశాఖపట్టణం ఆర్డీవో దిలీప్ చక్రవర్తి, జీవీఎంసీ అదనపు కమిషనర్లు రమణ మూర్తి, రమేశ్, వర్మ, సత్యవేణి, నల్లనయ్య, ఎస్.ఈ. సత్యనారాయణ రాజు, ఈఈ, డీఈలు, సీసీపీ, సీపీలు, పలువురు జోనల్ కమిషనర్లు, ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కామాక్షి దేవి ఆలయంలో దేవినవరాత్రులు.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 14:** నిదానందొడ్డి లో వేంచేసియున్న కామాక్షి దేవి ఆలయంలో దసరా నవరాత్రి మహోత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారు భక్తులకు రాజరాజేశ్వరి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సిరి స్పందన నృత్యాలయం విద్యార్థులచే భరతనాట్యం ప్రదర్శన భక్తులు నాకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పట్టణ సంఘం అధ్యక్షులు పొన్నాడ వెంకట సత్యనరసింహ ఆచారి (పెదబాబు), ప్రధాన కార్యదర్శి యండపల్లి మోహన్ బ్రహ్మాజీ, కోశాధికారి కిల్లాడ శ్రీనివాస రావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు వెదురుపాటి సుందరయ్య (బాబి), పట్టణ కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు,విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ దేవి అలంకరణలో దుర్గా దేవి.

**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 14:** ప్రసిద్ధి చెందిన అనకాపల్లి, గవరపాలెం శతకం పట్టు లో కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి మహోత్సవంలో భాగంగా బుధవారం అమ్మవారికి అన్నపూర్ణ దేవిగా అలంకరణ చేసిసారు. ఈ అలంకరణ ఉదయగిరి చంద్రశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు కే హరి నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించి, అమ్మవారికి నిత్య పూజ్యులు, అభిషేకాలు నిర్వహించారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు అండ్ బ్రదర్స్ ఆర్థిక సహకారంతో మాల ధారణ చేసిన భవానీ భక్తులకు నవరాత్రి పది రోజులు అన్న సమారాధన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సూరిశెట్టి శ్రీను, దూలం ప్రసాద్, గండేపల్లి మురళి, బుద్ధ సంతోష్, సూరి శెట్టి నర్సింగరావు (పైసా) ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రపతికి స్వాగతం పలికిన పెమ్మసాని.



**విజయవాడ, పెన్ సత్తా, అక్టోబర్ 14:** జాతీయ స్థాయి సరస్ అజీవికా మేళా ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు విజయవాడకు విచ్చేసిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ విజయవాడ విమానాశ్రయంలో బుధవారం సాదర స్వాగతం పలికారు. అక్టోబర్ 15 వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు నిర్వహించినున్న ఈ మేళాలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించబోతున్నారు. గ్రామీణ మహిళల నైపుణ్యాలు, సృజనాత్మకత, వ్యాపార సామర్థ్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో సరస్ అజీవికా మేళాను నిర్వహిస్తున్నారు. ఈ మేళా ద్వారా వివిధ రాష్ట్రాల సంప్రదాయ ఉత్పత్తులు, హస్తకళలు, ఆహార పదార్థాలు, మహిళా సంఘాల విజయగాథలు ప్రజలకు పరిచయం కానున్నాయి. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం, వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడటం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సరస్ మేళాలో పాల్గొంటున్న మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు, గ్రామీణ మహిళా సాధికారత ప్రాధాన్యతను మరింతగా చాటనుంది.

# ప్రేక్షకులును ఆకట్టుకున్న పౌరాణిక పద్య నాటకం.

**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 14:**దసరాశరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా స్థానిక గవరపాలెం శతకం పట్టు కనకదుర్గమ్మ నవరాత్రి మహోత్సవాల లో భాగంగా గవరపాలెం గౌరీ సేవా సంఘం కర్రి రమేష్ కళ్యాణ వేదిక పై ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక ఉత్సవాలు బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి. ముఖ్య అతిథిగా విచ్చేసి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వర రావు జ్యోతి ప్రజ్వలన చేసి నాటికి పోటీలను ప్రారంభించారు. అనంతరం అక్కినేని సంస్కృతిక సమాజం విజయనగరం వారి మోహిని భస్మాసుర పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది, రచించిన మద్దెల పంచనాదం, దర్శకత్వం గవర సత్తిబాబు. ఈ కార్యక్రమంలో నాటకోత్సవాలకు ఆర్థిక సహకారం అందించిన ప్రముఖ వర్తకులు కర్రీ సన్యాసినాయుడు, కనకదుర్గమ్మ ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, నాటక పర్యవేక్షకుడు మాజీ కౌన్సిలర్ కేఎం నాయుడు, రంగస్థలం కళాకారుడు మళ్ల సూరిబాబు, విల్లూరి సత్యనారాయణ, బోడ్డేర రామ సత్యనారాయణ, పివి సత్యనారాయణ, బుద్ధ శ్రీనివాసరావు, సీతారాం బుజ్జి, కాండ్రేగులబుజ్జి, కొయిలాడ నాగ గణేష్, సోదర సంక్షేమ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై కేసుల వివరాలు వెల్లడించాలి

**తాడేపల్లి: పెన్ సత్తా, అక్టోబర్ 14** ఆంధ్రప్రదేశ్ లో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులపై నమోదైన/పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను వెల్లడించేందుకు పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ను వైఎస్సార్సీపీ కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి లేఖ రాశారు. ఇందులో ఆయన కూటమి సర్కార్ పోలీసుల సాయంతో వైఎస్సార్సీపీ ఆశావహ అభ్యర్థులపై చేస్తున్న వేధింపుల్ని ప్రస్తావించారు. వాటిని అడ్డుకోవడంతో పాటు తమ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు అవసరమైన వివరాలు అందించేందుకు రాష్ట్ర డీజీపీకి తగిన ఆదేశాలు ఇవ్వాలని కూడా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కోరారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయబోతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆశావహ అభ్యర్థులను తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వేధిస్తోందని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలతో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి సంబంధం లేకపోయినా, వివిధ పోలీస్ స్టేషన్లలో తమ పార్టీ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలు వారిలో భయాందోళనలు సృష్టించడంతోపాటు ఎన్నికల ప్రక్రియలో వారు పాల్గొనడానికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, తమపై కేసులు ఎక్కడ నమోదు అయ్యాయో, ఏ పోలీస్ స్టేషన్‌లో లేదా ఏ జిల్లాలో కేసులు నమోదయ్యాయో కూడా అనేక మంది ఆశావహ అభ్యర్థులకు తెలియజేయడం లేదన్నారు. ఫలితంగా, సంబంధిత సమాచారాన్ని పొందడానికి వారు ఏ అధికారులను సంప్రదించాలో తెలియక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీంతో నామినేషన్ పత్రాల్లో కేసులకు సంబంధించిన పూర్తి, కచ్చితమైన వివరాలను సమర్పించడంలో పలు సమస్యలు ఎదురవుతున్నాయని ఎస్ఈసీకి రాసిన లేఖలో వెల్లడించారు.తమపై నమోదైన కేసుల వివరాలు, నమోదైన ప్రదేశాలు తెలియకపోవడం వల్ల అభ్యర్థులు ఎన్నికల్లో నష్టపోకుండా చూడాలని ఎన్నికల కమిషన్ ను లేళ్ల అప్పిరెడ్డి కోరారు. నేరాలు, నేరస్థుల రికార్డులను తెలుసుకోవడానికి పోలీసు శాఖ వద్ద ఇప్పటికే క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (జజుబీూ) అనే డిజిటల్ వ్యవస్థ అందుబాటులో ఉందని, దీన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్నారని తెలిపారు. జజుబీూ ద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోని సంబంధిత రికార్డులను తెలుసుకోవచ్చని భారత ప్రభుత్వం పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత జిల్లా లేదా పోలీసు విభాగంతో సమన్వయం చేసుకుంటూ, అందుబాటులో ఉన్న రికార్డుల మేరకు ప్రతి కేసుకు సంబంధించిన పోలీస్ స్టేషన్ పేరు, క్రైమ్ నంబర్, సంవత్సరం, వర్తించే చట్టపరమైన సెక్షన్లు, ప్రస్తుత దర్యాప్తు స్థితి, తుది నివేదిక/ఛార్జిషీట్‌కు సంబంధించిన వివరాలతో కూడిన సమగ్ర, ధృవీకృత ప్రకటనను లిఖితపూర్వకంగా అందించాలని కోరారు.

## నూకాంబికను దర్శించుకున్న పృథ్వి తేజ జాహ్నవి.





**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 14:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు భాగంగా బుధవారం అమ్మవారిని దర్శించుకున్న ఏపీ ఈపిడిసిఎల్ సిఎండి పృద్వి తేజ జాహ్నవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా టిడిపి కార్యాలయంలో సమావేశ మైన కూటమి నేతలు.





**విశాఖపట్నం, పెన్ సత్తా, అక్టోబర్ 14:** జీవీఎంసీకి జరగబోయే ఎన్నికలలో సమన్వయంతో పనిచేయడానికి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరాం అధ్యక్షతన బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి నేతలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మనమందరం సమిష్టిగా పనిచేసి అత్యధిక స్థానాలు గెలుపొందించడానికి కృషి చేద్దామని వీరు నిర్ణయించుకున్నారు. జిల్లా అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ శాసనసభ్యులు లేని నియోజకవర్గాలలో సమన్వయకర్తలను కలుపుకుని వెళ్లాలని సూచించారు. సమావేశంలో స్థానిక ఎన్నికల పరిశీలకులు ఎంఏ షరీఫ్, రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, గణబాబు, పి విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, శాసనమండలి సభ్యులు ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి, పెందుర్తి ఇంచార్జ్ గండి బాబ్జి, దక్షిణ నియోజకవర్గం ఇంచార్జ్ సీతం రాజు సుధాకర్, పీలా గోవింద సత్యనారాయణ, ఉడా చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్, బిజెపి అధ్యక్షులు పరశురామరాజు , విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవిగా కన్యకా పరమేశ్వరి.



**అనకాపల్లి, పెన్ సత్తా, అక్టోబర్ 14:** పట్టణంలో ప్రసిద్ధి చెందిన వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవం బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు, ఆలయ మండపంలో బేడసేవ, శ్రీ చక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ నిర్వహించార. శ్రీహరి భజన మండలి వారిచే కోలాట నృత్య ప్రదర్శన చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుత రామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

# సౌదీలో దాడులు వెంటనే ఆపాలి



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో సౌదీ అరేబియాలో పౌర మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలు, చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దాడులను భారతదేశం ఖండించింది. ఈ దాడులు తక్షణమే నిలిపివేయాలని, ఎంత మాత్రం పౌర మౌలిక సదుపాయాలపై దాడులు ఆమోదయోగ్యం కాదని ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) స్పష్టం చేసింది. సౌదీలోని భారత పౌరుల కోసం అక్కడి భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసింది. పౌరులు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, స్థానిక అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. ఇదే సమయంలో విదేశాల్లోని భారత పౌరుల సంక్షేమం, భద్రత తమ ప్రథమ ప్రాధాన్యం అని ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో జైస్వాల్- పలు కీలక అంశాలపై భారత వైఖరిని వెల్లడించారు.

సౌదీ అరేబియాలో జరుగుతున్న దాడుల పట్ల విచారం వ్యక్తం చేసిన భారత్- సౌదీ ప్రజలు, ప్రభుత్వానికి సంఘీభావం తెలుపుతోందని జైస్వాల్ పేర్కొన్నారు. ఆ దేశ సార్వభౌమత్వం, సమగ్రతను కాపాడుకునే ప్రయత్నాలకు భారత్ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో త్వరలోనే శాంతి చర్చలు జరిగి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై అక్టోబర్ 10న జరిగిన దాడిలో మొత్తం ఒక భారతీయుడు సహా మొత్తం 13 మంది మరణించగా, మరో 10 మంది భారతీయులు గాయపడ్డారు. మృతుడి కుటుంబ సభ్యుల మేరకు సౌదీలోనే అంత్యక్రియలు నిర్వహించారు. యెమెన్‌లోని ఇరాన్ మద్దతు ఉన్న హూతీ తిరుగుబాటుదారులు కొద్ది రోజులుగా సౌదీపై వరుస దాడులకు పాల్పడుతున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. గాయపడిన భారతీయుల్లో పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

**భారతీయులకు ఎంబసీ కీలక మార్గదర్శకాలు**

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా దాడులు జరుగుతున్నందున అక్కడి భారతీయులకు, భారత రాయబార కార్యాలయం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. భారతీయులు అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, స్థానిక అధికారుల సూచనల్ని కచ్చితంగా పాటించాలని పేర్కొంది. జరుగుతున్న పరిణామాలకు సంబంధించి వీడియోలు, వార్తల్ని ధ్రువీకరించకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. భారతీయులకు సహాయం చేసేందుకు ఎంబసీ 24 గంటల కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో 0966- 536216082 (వాట్సాప్) నంబర్‌కు సందేశాలు పంపొచ్చు. ఇంకా 8002471234 నంబరు ద్వారా అధికారుల్ని సంప్రదించొచ్చు. మరోవైపు గల్ఫ్, హర్మూజ్ జలసంధి ప్రాంతాల్లో వాణిజ్య నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. ఈ క్రమంలో భారత జాతీయ భద్రతా సలహాదారు (చీూూ) అజిత్ డోభాల్ అక్టోబర్ 12న ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహ్‌సేన్ రెజాయితో ఫోన్‌లో మాట్లాడినట్లు రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. సముద్ర మార్గాల్లో భారత నావికులు, చమురు ట్యాంకర్ల భద్రతపై ఇరువురు చర్చించినట్లు తెలిపారు. ఇటీవల వారం వ్యవధిలోనే భారతీయ సిబ్బంది ఉన్న 3 వాణిజ్య నౌకలపై వరుస దాడి ఘటనలు సముద్ర భద్రతపై ఆందోళనలు పెంచాయి.

**దిల్లీలో దీ×మీూజుజ హోం మంత్రుల భేటీ- బంగ్లాదేశ్ హాజరు**

ఇక కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన న్యూదిల్లీలో తొలి బిమ్‌స్టెక్ (దీ×మీూజుజ) హోం మంత్రుల భేటీ జరిగినట్లు జైస్వాల్ తెలిపారు. ఇందులో బంగ్లాదేశ్‌తో సహా అన్ని సభ్యదేశాలు పాల్గొన్నాయని వెల్లడించారు. ఇందులో ఉగ్రవాద నిర్మూలన, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై చర్యలు, మనీలాండరింగ్ నియంత్రణలో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని పునరుద్ఘాటిస్తూ 'దిల్లీ డిక్లరేషన్'ను ఆమోదించారని ఎంఈఏ అధికార ప్రతినిధి వివరించారు. కొంతకాలంగా భారత్- బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, దిల్లీలో నిర్వహించిన ఈ సమావేశంలో బంగ్లాదేశ్ పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. దిల్లీ నిరసనలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం (ూఎజుఎ=) చేసిన వ్యాఖ్యలను కూడా భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇది భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని, ఆ వ్యాఖ్యలు అనుచితమని తోసిపుచ్చింది. ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న అణచివేతలపై స్పందించని ఓహెచ్‌సీహెచ్ఆర్ వైఖరి ఏకపక్షంగా ఉందని భారత్ వైఖరిని వెల్లడించారు జైస్వాల్.

## చైనాతో సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే

# వాస్తవాధీన రేఖ స్థిరంగా ఉండాలి



భారత్- చైనా మధ్య సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే 'వాస్తవాధీన రేఖ' వెంబడి పరిస్థితి స్థిరంగా ఉండాలని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. సరిహద్దుల్లో ఎటువంటి అశాంతి చెలరేగినా దానికి పర్యవసానాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణ సరిహద్దు వద్ద శాంతితోనే ముడిపడి ఉన్నాయని అభిప్రాయపడ్డారు. దిల్లీలో జరిగిన 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్'లో ప్రసంగిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

"చైనాకు మేము చెప్పే విషయం ఒకటే 'మీరు ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలను కోరుకున్నా, మిగిలిన సంబంధాలు ముందుకు సాగాలన్నా సరిహద్దు స్థిరంగా ఉండాలి. సరిహద్దు ప్రాంతాల్లో శాంతి అనేది చాలా స్పష్టమైన, సహజమైన విషయం'" అని ఆయన అన్నారు. 2024 నుంచి ూూజ వెంబడి పరిస్థితి చాలా వరకు అదుపులోకి వచ్చిందని, ఫలితంగా సంబంధాలు సాధారణ స్థితి వైపు పయనిస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. తూర్పు లద్దాఖ్‌లో నాలుగన్నర ఏళ్లకు పైగా కొనసాగిన సైనిక ప్రతిష్టంభన కారణంగా దెబ్బతిన్న సంబంధాలను సరిదిద్దడానికి గత కొన్ని నెలలుగా ఇరుపక్షాలు చర్చలు చేపట్టాయి. చివరకు ఇరు దేశాల మధ్య పలు దఫాల చర్చల అనంతరం ప్రతిష్టంభన 2024 చివరలో ముగిసింది. ఈ క్రమంలోనే సరిహద్దు సమస్యపై ఏదైనా 'ప్రారంభ దశ ఒప్పందం' కుదిరితే దేశంలో మరిన్ని చైనా పెట్టుబడులను భారత్ అనుమతిస్తుందా అన్న ప్రశ్నకు సమాధానంగా, వివిధ అవకాశాలను పరిశీలిస్తున్నామని జైశంకర్ స్థూలంగా చెప్పారు. "మేము ఇప్పుడు ఆ అవకాశాలను పరిశీలిస్తున్నాం. భవిష్యత్తులో పరిస్థితి ఎలా ఉంటుందో చూడాలి. అయితే, వ్యాపారం చేయడానికి ముందు సరిహద్దు సమస్యను తప్పనిసరిగా పరిష్కరించుకోవాలని మేము పట్టుబట్టడం లేదు. మేము పెద్ద నిబంధనలు లేదా కఠినమైన షరతులు పెట్టడం లేదు. మా అంచనాలు చాలా తక్కువగా ఉన్నాయి. కేవలం శాంతి, ప్రశాంతతను పాటించడం మాత్రమే కావాలి. సరిహద్దు సమస్య పరిష్కారం తప్ప మరేదానితోనూ ఈ 'ప్రారంభ దశ ఒప్పందాన్ని' నేను ముడిపెట్టను. వ్యాపారం లేదా మార్కెట్ యాక్సెస్ అంశాలకు సంబంధించి మేము అనుసరించే విధానాలు వేరుగా పరిగణిస్తాం."

చైనాతో ఉన్న ఆర్థికపరమైన అంశాలపై కూడా విదేశాంగ మంత్రి జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. "చైనాతో మాకు చాలా కీలకమైన ఆర్థిక సమస్యలు కూడా ఉన్నాయి. నేడు వాణిజ్య సమతుల్యతను పరిశీలిస్తే, అది పూర్తిగా చైనా వైపే మొగ్గు చూపి ఉంటోంది. ఈ అసమతుల్యత తీవ్రంగా ఒకే వైపునకే ఉంది. ప్రపంచంలోని ఇతర దేశాలతో అనేక రంగాల్లో మేము విజయవంతంగా వాణిజ్యం సాగిస్తున్నా, చైనాలో మాత్రం మాకు మార్కెట్ ప్రవేశం లభించలేదు. అక్కడ ఆయా రంగాల్లో మా వ్యాపార కార్యకలాపాలు విజయవంతం కాలేదు. మేము వారికి సమానమైన వాణిజ్య అవకాశాలను కల్పించినట్లుగా, చైనాలో మాకు అటువంటి సమాన అవకాశాలు లభించడం లేదని మేము భావిస్తున్నాం." అని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే 2020 నాటి గల్వాన్ లోయ ఘర్షణల గురించి కూడా జైశంకర్ ప్రస్తావించారు. అవి ఇరు దేశాల సంబంధాలపై ఎంత తీవ్రమైన ఒత్తిడిని కలిగించాయో గుర్తు చేశారు. "1975 నుంచి 2020 వరకు అంటే దాదాపు 45 ఏళ్ల పాటు సరిహద్దులో ఎటువంటి రక్తపాతం జరగలేదు. చివరిసారిగా 1975లో ప్రాణనష్టం జరిగింది. ఆ తర్వాత కాలంలో భారత్- చైనా సంబంధాలు మెరుగుపడ్డాయి. అనంతరం 2020లో మేము కొవిడ్ లాక్‌డౌన్ పరిస్థితుల్లో ఉన్నప్పుడు సరిహద్దులో వరుస సమస్యలు తలెత్తాయి. చివరకు అవి ఘర్షణకు దారితీసి ఇరువైపులా పలువురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మా దృష్టిలో ఇది 1975 నుంచి కొనసాగుతున్న పరిస్థితులకు పూర్తిగా భిన్నమైన పరిణామం. సరిహద్దు ప్రాంతాల్లో శాంతికి భంగం కలిగితే అది సంబంధాలపై ప్రభావం చూపుతుంది," అని జైశంకర్? అన్నారు. శాంతిని పునరుద్ధరించే వరకు తర్వాతి కొన్నేళ్లలో ఆ పరిణామాలు స్పష్టంగా కనిపించాయని జైశంకర్ పేర్కొన్నారు.

# 'జంతర్‌మంతర్ భారత ప్రజలది'

దిల్లీలోని జంతర్?మంతర్ వద్ద నిరసన తెలిపిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలను జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. జాతీయ జెండాను ప్రదర్శించినందుకు యువతను జైలుకు పంపడమేంటని ప్రశ్నించాయి. నిరసన తెలిపే హక్కును హరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విపక్ష నేతలు విమర్శించారు. జంతర్‌మంతర్ దేశ ప్రజలదని, దాన్ని తిరిగి సాధించుకుంటామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిని జైల్లో పెడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించడం నేరం కాదని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇలా చేసినందుకు యువతను జైలుకు పంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి వేర్వేరు వేదికలపై ఉన్నప్పటికీ అందరి లక్ష్యం ఒక్కటే. రాజ్యాంగం కల్పించిన హక్కులను కోరుతూ పౌరులు చేస్తున్న ఆందోళనలన్నీ ఒకే పోరాటంలో భాగం. జంతర్‌మంతర్ భారత ప్రజలకు చెందినది. దాన్ని తిరిగి సాధించుకుంటాం. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉంది' అని రాహుల్ గాంధీ తెలిపారు.

**ముందు ఓటు తర్వాత నిరసన హక్కు చోరీ : ఖర్గే**

"ఎస్ఐఆర్ ప్రక్రియకు వెలుపల ఉన్న 13.3 కోట్ల మందిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'చొరబాటుదారులుగా అభివర్ణించడం వారి జాతీయతను అవమానించడమే. సుప్రీంకోర్టు నిర్ణయం ఉన్నప్పటికీ జంతర్‌మంతర్‌ను నిరసనలకు అనుమతించిన ప్రదేశాల జాబితా నుంచి తొలగించడం అంటే మొదట ఓటు చోరీ ఇప్పుడు నిరసన తెలిపే హక్కు చోరీనే అవుతుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు రక్షణ కల్పించడం ఆపాలి. యువ నిరసనకారులను జైలుకు పంపడం, ఆందోళనకారులపై పోలీసులు బలప్రయోగం చేయడం, మహిళల పట్ల దురుసుగా వ్యవహరించారు. ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఉన్నట్లు తాను పేర్కొన్న కొన్ని వర్గాలకు అధికారులు స్వేచ్ఛనిస్తున్నారు. మోదీ-షా ప్రభుత్వ విధానాలకు ప్రజలు తలవంచబోరని, బీజేపీని ప్రతి అంశంపై నిలదీస్తారు. దేశ ప్రజలు తమ గొంతు వినిపిస్తూనే ఉంటారు"

**'మన దేశంలో మన జెండా ఎగరేయడం నేరమా?'**

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా సీజేపీ కార్యకర్తలపై చర్యలను తప్పుబట్టారు. సొంత దేశంలో జాతీయ జెండాను ప్రదర్శించడం నేరమా అని ప్రశ్నించారు. పోలీసుల చర్య పూర్తిగా హాస్యాస్పదంగా ఉందని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే కూడా సీజేపీ కార్యకర్తల అరెస్టును ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. జంతర్ మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించిన యువతను జైలుకు పంపడమేంటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి సాధించుకునే వరకు ప్రభుత్వానికి, దేశభక్తులైన యువతకు మధ్య పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

**అరెస్టయిన యువతకు అండగా డీఎంకే**

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సైతం ఈ ఘటనపై స్పందించారు. ఎంతమంది నిరసనకారులను ప్రభుత్వం నిర్బంధించగలదని, ఎంతమంది యువత గొంతులను అణచివేయగలదని ప్రశ్నించారు. యువతను జైలుకు పంపే కొద్దీ రాజకీయాలతో సంబంధం లేని సాధారణ పౌరులు సైతం వీధుల్లోకి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేస్తారని అన్నారు. సౌరవ్ దాస్, ఆశుతోష్‌కు అవసరమైన న్యాయ సహాయం అందించేందుకు డీఎంకే సిద్ధంగా ఉందని తెలిపారు. నిరసనకారులపై చర్యలు ప్రజల్లో మరింత వ్యతిరేకతను పెంచుతాయని హెచ్చరించారు.

ఇదిలా ఉండగా, ఆందోళనల సమయంలో పలువురు నిరసనకారులను పోలీసులు కొట్టారని మీడియా సమావ్టశంలో రాహుల్ ఆరోపించారు. ప్రజల ముక్తకంఠాన్ని అణచివేయాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కేంద్ర ప్రభుత్వాన్నిహెచ్చరించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వీరికి కులం, మతం, లింగ భేదాలు లేవని చెప్పారు. ముక్త కంఠంతో పోరాడుతున్న వారిపై దాడులు సహించబోమని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా ఈ ప్రజా గళానికి వ్యతిరేకంగా నిలబడుతున్నారని, ఆ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని సూచించారు. దౌర్జన్యాలకు పాల్పడుతున్న పోలీసుల వీడియోలు తీసి, ఆ ఆధారాలను తమకు పంపాలని విద్యార్థులకు సూచించినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారం ముగిసిన తర్వాత ఆ సాక్ష్యాధారాలతో విద్యార్థులపై చేయి చేసుకున్న వారికి శిక్ష పడేలా చేస్తామన్నారు.

**పోలీస్ స్టేషన్‌లోనూ కొట్టారని ఆరోపణ**

తనపై ఓ మహిళా కానిస్టేబుల్ దాడి చేశారని ఎన్ఎస్‌యూఐ మహిళా కార్యకర్త తెలిపారు. నిరసనలో పాల్గొన్న కార్యకర్తలను పోలీసులు మూడు బస్సుల్లో ఎక్కించి అదుపులోకి తీసుకున్నారని చెప్పారు.

## ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..



తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు 'లెహ్రావో దో తిరంగా' అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు. ఢిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు.

**ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ**

మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

## దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోంది



భారతదేశ సంగీతం, నృత్యం, సినిమాలు, వంటకాలు దేశాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాజాలతో అనుసంధానిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వీటి వల్ల దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోందని కొనియాడారు. చారిత్రక కట్టడాలను పరిరక్షించడంతో పాటు 'జ్ఞాన్ భారతం' కార్యక్రమం ద్వారా భారత పురాతన తాళపత్రాల వారసత్వాన్ని కూడా ప్రభుత్వం పరిరక్షిస్తోందని ఆయన తెలిపారు. అక్టోబర్ 14 నుంచి 16 వరకు దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న 'బృహత్తర భారత్: ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు'ను ఉద్దేశించి పంపిన సందేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్ ప్రధాన మంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా పాల్గొన్నారు. విదేశాల నుంచి పురాతన కళాఖండాలను తిరిగి భారత్?కు తీసుకువచ్చే ప్రయత్నాలు కొత్త ఊపును అందుకున్నాయని తెలిపారు. అదే సమయంలో భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పెరుగుతోందని మోదీ చెప్పారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వం, సరిహద్దులకు అతీతంగా విస్తరించిన దాని నాగరికతా వారసత్వం అనే ఇతివృత్తంతో జరుగుతోంది. ఈ సదస్సును కేంద్ర సాంస్కృతిక శాఖ పరిధిలోని 'ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్' (×+చీజూూ) నిర్వహిస్తోంది. ప్రపంచంతో భారతదేశానికి ఉన్న చారిత్రక, సమకాలీన సాంస్కృతిక సంబంధాలపై చర్చించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. దీనికి వివిధ దేశాల ప్రతినిధులు, రాయబారులు, పండితులు హాజరవుతున్నారు. అలాగే, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆధ్యాత్మిక మార్గదర్శకత్వంలో అప్పటి కలకత్తాలో 1926 అక్టోబర్ 14న భారతీయ పండితుల బృందం స్థాపించిన 'గ్రేటర్ ఇండియా సొసైటీ' (బృహత్తర భారత్ పరిషత్) శతజయంతి ఉత్సవాలకు కూడా ఇది వేదికైందని ×+చీజూూ పేర్కొంది.

## షార్జాలో భారతీయుడికి జాక్‌పాట్..

## లాటరీలో రూ. 13 కోట్లు!



యూఏఈలోని షార్జాలో నివసిస్తున్న కిషోర్ అనే ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. ఆయన ఏకంగా 5 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 13 కోట్లు) లాటరీ గెలుచుకున్నారు. యూఏఈ లాటరీలో రెండో బహుమతిని ఆయన సొంతం చేసుకున్నారు.

వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 3న యూఏఈ లాటరీ నిర్వాహకులు డ్రా తీశారు. ఈ డ్రాలో కిషోర్ కొనుగోలు చేసిన టికెట్‌కు రెండో బహుమతి దక్కింది. ఆయన అధికారిక వెబ్‌సైట్ ద్వారా 50 దిర్హమ్‌లు (సుమారు రూ. 1300) వెచ్చించి ఈ టికెట్‌ను కొనుగోలు చేశారు. లాటరీ ఫలితాలు వెలువడిన తర్వాత, విజేతల జాబితాలో తన పేరు చూసి మొదట నమ్మలేకపోయానని కిషోర్ తెలిపారు. ఆ తర్వాత తన వద్ద ఉన్న టికెట్ నంబర్‌తో సరిచూసుకుని, విజేతను తానేనని నిర్ధారించుకున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ లాటరీ డ్రాలో 30 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 78 కోట్లు) భారీ జాక్‌పాట్‌ను ఎవరూ గెలుచుకోలేదని నిర్వాహకులు తెలిపారు. కిషోర్ లాటరీ గెలిచిన విషయాన్ని యూఏఈ లాటరీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఒక్క లాటరీ టికెట్‌తో రాత్రికి రాత్రే కోటీశ్వరుడైన కిషోర్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు..
PEN SATTA Telugu Daily
గురువారం 15 అక్టోబర్ 2026

## సంపాదకీయం

# ధరల సుడి!?

దేశంలో ధరల మంట మళ్లీ ఉగ్రరూపం దాలుస్తోంది. సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి చేరింది. ఇది దాదాపు రెండేళ్లలో అత్యధిక స్థాయి. వరుసగా నాలుగో నెలా వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ), భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించుకున్న 4 శాతం లక్ష్యాన్ని దాటి పరుగులు తీసింది. ఇవి ప్రతి ఇంటి వంటగదిలో, కుటుంబ బడ్జెట్‌లో కనిపించే కఠోర వాస్తవాలు. ముఖ్యంగా పల్లెలపై ఈ భారం మరింత తీవ్రం. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 6.08 శాతానికి ఎగబాకింది. ఆగస్టు నుంచి సెప్టెంబర్ మధ్యలోనే గ్రామీణ ఆహార ద్రవ్యోల్బణం 8.06 శాతాన్ని తాకింది. గ్రామీణ కుటుంబాలు తమ ఖర్చులో దాదాపు సగభాగం ఆహారానికే వెచ్చిస్తాయి కనుక.. తిండి ధరలు పెరిగితే ఆ ఇళ్లపై పడే దెబ్బ పట్టణ కుటుంబాల కంటే చాలా ఎక్కువ. ఈ పెరుగుదలలో ఉల్లి, వెల్లుల్లి, అల్లం ప్రధాన పాత్ర పోషించాయి. రోజువారీ వంటకు తప్పనిసరి అయిన ఈ దినుసులు కొనాలంటే సామాన్యుడు జేబు తడుముకోవాల్సిన పరిస్థితి. బంగాళాదుంప, టమాటా ధరలు గత ఏడాది కంటే తక్కువే అయినా, అది మొత్తం చిత్రాన్ని మార్చేంత పెద్దది కాదు. పైగా కాయగూరల ధరలు ఎప్పుడు ఎగురుతాయో, ఎప్పుడు వాడిపోతాయో చెప్పలేం. ఈ అస్థిరతే రైతుకు నష్టం, వినియోగదారుడికి కష్టం. ముందున్నది పండుగల సీజన్. ఈ సమయంలో డిమాండ్ సహజంగానే పెరుగుతుంది. మరోవైపు లోటు వర్షపాతం, ఎల్‌నినో వల్ల పంటలకు, ఆదాయాలకు ముప్పు, అసాధారణంగా పెరిగిన ఉష్ణోగ్రతలు గ్రామీణ కుటుంబాలను ఆందోళనలో ముంచుతున్నాయి. పంట దిగుబడి తగ్గితే రైతుకు ఆదాయం పడిపోతుంది. అదే సమయంలో తాను కొనే వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇలా ఒకేసారి రెండు వైపులనుంచి ఒత్తిడి వచ్చే పరిస్థితే గ్రామీణ భారతం ఇప్పుడు ఎదుర్కొంటున్న అసలు సంక్షోభం.

ధరల పెరుగుదల వెనుక దేశీయ కారణాలే కాదు; ప్రపంచ పరిణామాలూ పనిచేస్తున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ ఇరాన్‌పై యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇంధనం, ఆహారం, రవాణా ఖర్చులు ద్రవ్యోల్బణాన్ని ముందుకు నెడుతున్నాయి. దీనికి రూపాయి విలువ క్షీణత తోడైంది. పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ లెక్కల ప్రకారం, భారత క్రూడ్ బాస్కెట్ ధర రెండు నెలల్లోనే 41 శాతం పెరుగుదల. చమురు మన ఆర్థిక వ్యవస్థకు రక్తనాళం లాంటిది. అది ఖరీదైతే సరకు రవాణా, ఉత్పత్తి, పంపిణీ అన్నీ ఖరీదవుతాయి. వస్తువుల రవాణా సేవల ద్రవ్యోల్బణం ఆగస్టులో 14.64 శాతం ఉండగా, సెప్టెంబర్‌లో 14.73 శాతానికి చేరింది. రెస్టారెంట్, వసతి సేవల ద్రవ్యోల్బణం 9.36 శాతానికి ఎగసింది. ఆహారం, ఇంధనం మినహాయించి, విలువైన లోహాలు కలిపి చూసే కోర్ ద్రవ్యోల్బణం ఆగస్టులోని 4.16 శాతం నుంచి సెప్టెంబర్‌లో 4.6 శాతానికి పెరిగింది. అంటే ధరల ఒత్తిడి కేవలం కొన్ని వస్తువులకే పరిమితం కాకుండా అన్ని రంగాలకూ విస్తరిస్తోందని అర్థం. మరోవైపు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల్లో రికార్డు స్థాయిలో రూ.3.08 లక్షల కోట్లు భారత ఈక్విటీల నుంచి వెనక్కి తీసుకున్నారు. ఇది 2025 మొత్తం కాలంలో జరిగిన ఉపసంహరణకు దాదాపు రెట్టింపు. సురక్షిత పెట్టుబడుల వైపు, డాలర్ ఆధారిత మెరుగైన రాబడుల వైపు, అధిక బాండ్ ఈల్డ్‌లవైపు మదుపరులు మళ్లడమే ఇందుకు కారణం. ఫలితంగా ఏడాది కాలంలో రూపాయి డాలరుతో పోలిస్తే సుమారు 7 శాతం బలహీనపడింది. రిజర్వ్ బ్యాంక్ నేరుగా డాలర్లు అమ్మడం, విదేశీ మారకద్రవ్యం ఆకర్షించడం వంటి చర్యలు చేపట్టినా ఒత్తిడి పూర్తిగా తగ్గలేదు. ఇదే నేపథ్యంలో ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) అక్టోబర్‌లో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చింది. ఫిబ్రవరి 2023 తర్వాత మొదలైన విరామానికి ఇది తెరదించింది. ధరల ఒత్తిడి ఇంకా విస్తరిస్తే డిసెంబర్‌లో మరో పెంపు తప్పదనే సూచనలున్నాయి. ప్రస్తుతం సీపీఐ ద్రవ్యోల్బణం ఆర్బీఐ సహన పరిమితి అయిన 6 శాతానికి కేవలం 0.46 శాతం పాయింట్ల దూరంలోనే ఉంది. అంటే ప్రమాద ఘంటిక మోగుతూనే ఉంది.

ఈ పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రిజర్వ్ బ్యాంక్ సమన్వయంతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. వడ్డీ రేట్లు పెంచడం ద్వారా డిమాండ్‌ను అదుపు చేయవచ్చు. కానీ ఉల్లి, వెల్లుల్లి, అల్లం ధరల పెరుగుదల సరఫరావైపు సమస్య. దానిని వడ్డీ రేట్లతో పరిష్కరించలేం. కాబట్టి పంటల నిల్వ, రవాణా సౌకర్యాలు, శీతల గిడ్డంగులు, మార్కెట్ అనుసంధానం వంటి మౌలిక వసతులను బలోపేతం చేయాలి. అవసరమైనప్పుడు బఫర్ నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేయడం, దిగుమతులను సులభతరం చేయడం, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతలపై కఠిన చర్యలు తీసుకోవడం వంటివి తక్షణ ఉపశమనం ఇవ్వగలవు. అదే సమయంలో రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చూడాలి. లేకపోతే వినియోగదారుడికి ధరలు పెరిగినా రైతు జేబులో మాత్రం డబ్బు చేరదు. మధ్యలో దళారులే లాభపడతారు. గ్రామీణ కుటుంబాలను ఆదుకోవడానికి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలి. ఉపాధి హామీ పనులు సకాలంలో, తగినంతగా లభించేలా చూడాలి. వర్షాభావం, ఎల్‌నినో ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాన్ని త్వరగా అంచనా వేసి పరిహారం, బీమా చెల్లింపులు వేగంగా అందించాలి. ఇంధన విషయంలో ఆర్బీఐ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల కోసం ప్రత్యేక డాలర్ సదుపాయం ప్రకటించింది. ఇది స్పాట్ మార్కెట్‌లో రూపాయిపై ఒత్తిడిని కొంత తగ్గించవచ్చు. కానీ అది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. చమురు దిగుమతులపై అధిక ఆధారపడటం, భౌగోళిక రాజకీయ ప్రమాదాలు కొనసాగినంత కాలం దీర్ఘకాలిక పరిష్కారం దొరకదు. అందువల్ల పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, ప్రజా రవాణా, దేశీయ ఇంధన వనరుల అభివృద్ధి వంటి మార్గాల్లో వేగంగా ముందుకు సాగడం అనివార్యం. పశ్చిమాసియా యుద్ధానికి స్పష్టమైన ముగింపు కనిపించని ఈ దశలో, ముడి చమురు ధరలు ఎక్కువగా ఉండి, రూపాయి బలహీనంగా ఉన్నంత కాలం దిగుమతి ద్రవ్యోల్బణం రాబోయే నెలల్లో కూడా దేశీయ ధరలను ప్రభావితం చేసే అవకాశమే ఎక్కువ. కాబట్టి ప్రభుత్వాలు మాటల కంటే చేతలపై దృష్టి పెట్టాలి. ధరల నియంత్రణ కేవలం ఆర్థిక గణాంకాల సమస్య కాదు. అది సామాన్యుడి కంచంలో అన్నం, పల్లె ప్రజల ఆత్మవిశ్వాసం, దేశ సామాజిక స్థిరత్వానికి సంబంధించిన విషయం. పండుగ వేళ ప్రతి ఇంట్లో దీపం వెలిగేలా, ధరల మంట ఆ వెలుగును ఆర్పేయకుండా చూడటమే పాలకుల తక్షణ కర్తవ్యం!

## పనికొచ్చే పలుకు



# లవ్ అంటే లైక్ కాదు.. లైఫ్‌స్టయిల్!

ఇన్‌స్టాలో "కపుల్ గోల్స్" రీల్స్‌కి హార్ట్ ఎమోజీలు పంపడం చాలా ఈజీ. కానీ మీ పార్ట్‌నర్ రాత్రి రెండింటి వరకు స్క్రోల్ చేస్తూ, బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేసి, రోజూ ఆన్‌లైన్ ఆర్డర్లతో బతికేస్తుంటే, "అది వాళ్ల ఇష్టం" అని వదిలేయడం ప్రేమ కాదు, ప్రేక్షక పాత్ర. ఎదుటివారు ఆరోగ్యంగా ఉండాలని మనసారా కోరుకుంటే, ఆ కోరిక మాటల్లోనే కాదు, చేతల్లోనూ కనిపించాలి. నిజమైన ప్రేమ కొన్నిసార్లు కొంచెం కఠినంగా అనిపిస్తుంది. కానీ రేపు వాళ్లు ఆరోగ్యంగా నవ్వుతూ ఉండాలన్నదే దాని లక్ష్యం. ఇక్కడ ఒక చిన్న ట్విస్ట్ ఉంది. ప్రోత్సహించడం అంటే నస పెట్టడం కాదు. "నువ్వు లావయ్యావు", "ఎప్పుడూ జంక్ తింటావు" అని సాగదీస్తే ఎదుటివారు మరింత డిఫెన్సివ్ అవుతారు, ఇంకా సీక్రెట్‌గా చిప్స్ తింటారు! మనిషి మనసు ఎలా పనిచేస్తుందంటే, విమర్శ విన్నప్పుడు మార్పు కంటే ప్రతిఘటనే ముందు వస్తుంది. కానీ "మనం కలిసి చేద్దామా?" అంటే తలుపు తెరుచుకుంటుంది. కంట్రోల్ చేసేవాళ్లను ఎవరూ ఇష్టపడరు, కలిసి నడిచేవాళ్లనే ఇష్టపడతారు. కాబట్టి మీరు ఒక కోచ్‌లా కాదు, ఒక టీమ్‌మేట్‌లా ఉండాలి.

ఎలా మొదలుపెట్టాలి? కొన్ని చిన్న ఐడియాలు:

వాక్ అండ్ టాక్ డేట్: కాఫీ షాప్ బదులు సాయంత్రం నడకకు వెళ్లండి. ఫోన్ జేబులోనే ఉండాలి!

కలిసి వంట: వారంలో రెండు రోజులు ఇద్దరూ కలిసి ఇంట్లో వండండి. రీల్‌కి కంటెంట్ కూడా దొరుకుతుంది.

స్లీప్ పాక్ట్: ఇద్దరూ ఒకే టైమ్‌కి ఫోన్లు పక్కన పెట్టండి. నిద్ర కూడా ఒక లవ్ లాంగ్వేజ్.

స్మాల్ విన్స్ సెలబ్రేషన్: మూడు రోజులు వరసగా నడిస్తే ఒక "చీట్ మీల్" కాదు, ఒక చిన్న ట్రీట్ ఇచ్చుకోండి. సెలబ్రేషన్ ఉంటే అలవాటు నిలుస్తుంది.

ఇక్కడ ఇంకో విషయం గుర్తుపెట్టుకోవాలి. ఆరోగ్యం అనేది ఓవర్‌నైట్‌లో వచ్చే రిజల్ట్ కాదు. ఏళ్ల తరబడి పేరుకున్న అలవాట్లు రెండు వారాల్లో మారిపోతాయనుకోవడం, రెండు రోజుల ప్రిపరేషన్‌తో ర్యాంక్ కొట్టేయాలనుకోవడం లాంటిదే. శరీరం కూడా "బ్రో, కొంచెం టైమ్ ఇవ్వు" అంటుంది. షార్ట్‌కట్లు వెతికేవాళ్లు మధ్యలోనే నిరాశపడి ఆగిపోతారు, నెమ్మదిగా కానీ క్రమం తప్పకుండా నడిచేవాళ్లే గమ్యం చేరతారు. మార్పు అనేది ఫాస్ట్ ఫార్వర్డ్ బటన్ ఉన్న వీడియో కాదు, నెమ్మదిగా లోడ్ అయ్యే సిరీస్. ఓపిక పట్టినవాళ్లకే క్లైమాక్స్ దక్కుతుంది. కాబట్టి మీ పార్ట్‌నర్‌ను ప్రోత్సహించేటప్పుడు కూడా ఓపిక చూపండి. ఒక్కరోజు మిస్ అయితే "చూశావా, నీకు చేతకాదు" అనకండి, "పర్లేదు, రేపు మళ్లీ చూద్దాం" అనండి. ఈ ఒక్క మాటకు ఉండే శక్తి ఒక జిమ్ మెంబర్‌షిప్‌కి కూడా ఉండదు.

చివరగా ఒక్క మాట. మనం ఇష్టపడేవాళ్లకు గిఫ్ట్‌లు, సర్‌ప్రైజ్‌లు ఇవ్వడం మంచిదే. కానీ వాళ్లకు మనం ఇవ్వగల అతి పెద్ద బహుమతి, ఆరోగ్యంగా గడిపే మరిన్ని సంవత్సరాలే. ఆ బహుమతిని ఇవ్వడానికి పెద్ద ఖర్చు అక్కర్లేదు, ఒక చిన్న ప్రోత్సాహం చాలు. కాబట్టి ఈ రోజే ఒక మెసేజ్ పంపండి: "సాయంత్రం వాక్‌కి వెళ్దామా?" ప్రేమకు అదే అసలైన "లైక్"!

# టెక్నాలజీకి.. 'సై'టుగాళ్ల సవాల్!

**చేతిలోని ఫోనే బ్యాంకుగా మారిన రోజుల్లో, డిజిటల్ చెల్లింపుల్లో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. కానీ అదే సాంకేతికతను ఆయుధంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు లక్షలాది మంది కష్టార్జితాన్ని క్షణాల్లో కొల్లగొడుతున్నారు. ఫిర్యాదులు దాదాపు పదిరెట్లు పెరిగినా, దోపిడీకి అడ్డుకట్ట ఎందుకు పడటం లేదు?**



ఒకప్పుడు బ్యాంకుకు వెళ్లాలంటే లైన్‌లో నిలబడాలి, చెక్కు రాయాలి, రోజంతా సమయం పట్టేది. ఇప్పుడు చేతిలోని ఫోన్‌లో ఒక్క నొక్కుతో లక్షల రూపాయలు క్షణాల్లో ఒక ఖాతా నుంచి మరో ఖాతాకు వెళ్తున్నాయి. టీ దుకాణం నుంచి కూరగాయల బండి వరకు, ఆటో డ్రైవర్ నుంచి ఆసుపత్రి వరకు ప్రతిచోటా క్యూఆర్ కోడ్‌లే కనిపిస్తున్నాయి. దేశంలో దాదాపు 96 కోట్లమంది ఇంటర్నెట్ వినియోగిస్తుండగా, ఈ ఏడాది జూన్‌నాటికి యూపీఐ వేదికల్లో 55.49 కోట్ల మంది నమోదయ్యారు. ప్రపంచమే మనవైపు ఆశ్చర్యంగా చూసేంతగా డిజిటల్ చెల్లింపుల్లో భారత్ ముందంజ వేసింది. కానీ ఈ వెలుగుకు వెనక ఒక చీకటి నీడ కూడా విస్తరిస్తోంది. సౌకర్యం పెరిగినచోటే మోసం కూడా పెరుగుతోంది. ఏడాది వ్యవధిలో పది శాతం మంది భారతీయులు సైబర్ నేరగాళ్ల బారిన పడ్డారని జీఎస్ఎంఏ గత నివేదిక వెల్లడించగా, అదే సంస్థ తాజా అధ్యయనం ఆ సంఖ్య పన్నెండు శాతానికి చేరిందని చెబుతోంది. అంటే ప్రతి వంద మందిలో పన్నెండు మంది ఏదోక రూపంలో మోసపోతున్నారు. ఇందులో ఆన్‌లైన్ షాపింగ్ మోసాల వాటా అధికం. బహుమతులు, లాటరీల పేరుతో బురిడీ కొట్టించడం, ఉద్యోగాల పేరుతో ఏమార్చడం విపరీతంగా సాగుతున్నాయి. సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ ప్రకటనలు, ఎస్ఎంఎస్‌లు, ఈమెయిళ్ల ద్వారా వల పన్నుతున్న కేటుగాళ్లు అందినకాడికి దోచుకుంటున్నారు. కొందరు తొందరపాటుతో ఉచ్చులో చిక్కుకుంటుంటే, మరికొందరు వ్యక్తిగత విషయాలు, పరిమిత కాల ఆఫర్ల పేరుతో ఊరించే మాటలు నమ్మి మోసపోతున్నారు. ఇంకొందరు తమను తాము అధికారులమని చెప్పుకుంటూ ఫోన్ చేసేవారి బెదిరింపులకు భయపడి కష్టార్జితాన్ని పోగొట్టుకుంటున్నారు. నమ్మకం మీద నడిచే డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రమాదకర సంకేతం.

ఈ మోసాల తీవ్రతను అర్థం చేసుకోవాలంటే గణాంకాలను చూడాలి. ఆర్థిక మోసాలపై జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ బ్యూరోకు 2021లో 2.62 లక్షల ఫిర్యాదులు అందితే, 2025 నాటికి అవి 24 లక్షలకు పైగా పెరిగాయి. కేవలం నాలుగేళ్లలో దాదాపు పది రెట్లు. ఆ అయిదేళ్ల కాలంలో ప్రజల సొమ్ము రూ. 55 వేల కోట్లకు పైగా సైబర్ నేరగాళ్ల పాలైందని నివేదికలు చెబుతున్నాయి. పైగా ఇవన్నీ నమోదైన కేసులు మాత్రమే. పరువు పోతుందన్న భయంతో, పోలీసుల చుట్టూ తిరగాలన్న విసుగుతో, డబ్బు తిరిగి రాదనే నిరాశతో ఫిర్యాదే చేయని బాధితులు ఎందరో ఉన్నారు. అందుకే కేవలం 2025లోనే దేశానికి రూ. 1.2 లక్షల కోట్లకు పైగా నష్టం జరిగి ఉండవచ్చని అంచనా. ఇది కేవలం ఆర్థిక నష్టం కాదు. డబ్బు పోగొట్టుకున్న వారిలో చాలామంది ఆందోళన, కుంగుబాటుతో సతమతమవుతున్నారు. పిల్లల చదువుకు దాచిన సొమ్ము, పదవీ విరమణ తర్వాత బతుకుకు ఆధారమైన పొదుపు ఒక్క ఫోన్ కాల్‌తో మాయమైతే ఆ కుటుంబాల వేదన మాటల్లో చెప్పలేనిది. ఇప్పుడు అసలు ప్రశ్న ఏమిటంటే, టెక్నాలజీ ఇంత వేగంగా అభివృద్ధి చెందుతున్నా మోసాలను ఎందుకు అదుపు చేయలేకపోతున్నాం? దీనికి కొన్ని కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది, నేరగాళ్లు కూడా అదే టెక్నాలజీని ఆయుధంగా వాడుతున్నారు. పౌర సేవలను, చెల్లింపులను సులభం చేసిన సాంకేతికతనే వారు తమ దోపిడీకి సాధనం చేసుకున్నారు. ఇప్పుడు కృత్రిమ మేధను కూడా దుర్వినియోగం చేస్తున్నారు. నకిలీ గొంతులు, నకిలీ వీడియోలు, నమ్మించేలా రాసిన సందేశాలతో వారి కోరలు మరింత పదునెక్కాయి. రెండోది, నేరగాడికి సరిహద్దులు లేవు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో, ఒక్కోసారి మరో దేశంలో కూర్చుని నకిలీ సిమ్‌లు, అద్దె ఖాతాలతో జనాన్ని ఏమార్చి క్షణాల్లో ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. పోలీసులు వెతికి పట్టుకునేలోగా సొమ్ము పదుల ఖాతాల్లోకి మారిపోతుంది. మూడోది, మన భద్రతా వ్యవస్థల వేగం నేరగాళ్ల వేగంతో పోటీ పడలేకపోవడం. డబ్బు క్షణాల్లో కదులుతుంది, కానీ ఫిర్యాదు నమోదు, దర్యాప్తు, ఖాతాల స్తంభన వంటి ప్రక్రియలు రోజులు, వారాలు పడుతున్నాయి.

ఈ సమస్యకు సాంకేతిక పరిష్కారాలతో పాటు మానవ కోణం కూడా ఉంది. మోసగాళ్లు సాంకేతికతను మాత్రమే కాదు, మనిషి మనసును కూడా లక్ష్యంగా చేసుకుంటారు. భయం, ఆశ, తొందర, సిగ్గు, నమ్మకం ఇవే వారి అసలు ఆయుధాలు. "మీ ఖాతా బ్లాక్ అవుతుంది", "ఈ ఆఫర్ ఈ రోజు మాత్రమే", "మీరు లాటరీ గెలిచారు" అనే మాటలు వినగానే ఆలోచన ఆగిపోతుంది. ఎంత పెద్ద చదువు చదివినవారైనా క్షణికావేశంలో బలైపోతున్న ఉదాహరణలు ఎన్నో. కాబట్టి ప్రజల్లో అవగాహన పెంచడం అత్యవసరం. ఏ బ్యాంకూ, ఏ అధికారీ ఫోన్‌లో ఓటీపీ అడగరని, తెలియని లింకులను నొక్కకూడదని, అనుమానం వస్తే ఫోన్ పెట్టేసి నేరుగా బ్యాంకును సంప్రదించాలని ప్రతి ఒక్కరికీ తెలియాలి. అయితే అవగాహన ఒక్కటే సరిపోదు. వ్యవస్థాగత రక్షణలు బలంగా ఉండాలి. కొల్లగొట్టిన సొమ్మును తరలించేందుకు నేరగాళ్లు వాడే మ్యూల్ ఖాతాలను అడ్డుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ 'మ్యూల్‌హంటర్' పేరుతో ఒక వ్యవస్థను తెచ్చింది. ఈ ఏడాది మార్చి నాటికి అది 26 బ్యాంకుల్లో అమల్లోకి వచ్చింది. ఆధునిక సాంకేతికతతో అనుమానాస్పద ఖాతాలను గుర్తించే ఈ పద్ధతిని మరిన్ని బ్యాంకులకు వేగంగా విస్తరించాలి. సిమ్ కార్డుల మంజూరులో అవకతవకలకు ఏమాత్రం తావుండకూడదు. సైబర్ కేసుల దర్యాప్తు త్వరగా ముగిసి నేరగాళ్లకు శిక్షలు పడినప్పుడే ఇతరుల్లో భయం పుడుతుంది. శిక్షల భయం లేనంతకాలం ఈ దందా ఆగదనే వాస్తవాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. పోలీసులు, బ్యాంకులు, టెలికాం సంస్థలు, డిజిటల్ వేదికలు సమన్వయంతో, ఒకే వేగంతో పనిచేయాలి. ఇందులో టెక్ సంస్థలకూ బాధ్యత ఉంది. తమ వేదికలపై నకిలీ ప్రకటనలు, నకిలీ ఖాతాలు రాజ్యమేలుతుంటే చూస్తూ ఊరుకోకూడదు. సౌకర్యం ఇచ్చే సంస్థలే భద్రత బాధ్యతను కూడా మోయాలి. చివరగా, డిజిటల్ విప్లవం ప్రజల జీవితాలను సులభం చేయడానికే కానీ భయపెట్టడానికి కాదు. ప్రజల నమ్మకమే ఈ వ్యవస్థకు వెన్నెముక. ఆ వెన్నెముక విరిగితే ఎంత అధునాతన సాంకేతికతైనా నిలబడదు. అందుకే ప్రభుత్వాలు, బ్యాంకులు, టెక్ సంస్థలు, ప్రజలు అందరూ కలిసికట్టుగా కదలాల్సిన సమయం ఇదే. ■



రోజూ నడవడం, తగినన్నీ నీళ్లు తాగడం, వ్యాయామం చేయడం, మంచి ఆహారం తీసుకోవడం, 8 గంటల నిద్ర, ఉదయం ఎండలో ఉండడం, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు వెళ్లడం, ప్రియమైనవారితో సమయం గడపడం వంటివి చేయకుండా నీరసంగా ఉందని ఎప్పుడూ ఫిర్యాదు చేయకండి. మనలోని నీరసాన్ని పోగొట్టి మరింత శక్తినిచ్చే ఈ చిన్న అలవాట్లను తక్కువ అంచనా వేయకండి.
శక్తి ఎక్కడి నుంచో వచ్చే వరం కాదు, రోజూ మనం చేసే ఎంపికల ఫలితం. అలవాట్లకు అలసత్వం అలవరిస్తే నీరసం నీడలా వెంటాడుతుంది; ఆరోగ్యాన్ని అలవాటుగా మార్చుకుంటే ఉత్సాహమే ఊపిరిగా నిలుస్తుంది!

-మహాదేవ

## వింతల్లో వింతలు

### నోరా.. ఎయిర్‌పోర్టా?



అమెరికాకు చెందిన డేవిడ్ రష్ నోరు తెరిచి నిలబడితే, కాగితపు విమానాలు ల్యాండింగ్‌కు క్యూ కట్టాయి! ఒక్క నిమిషంలో ఏకంగా 20 పేపర్ ప్లేన్లను నోటితో క్యాచ్ పట్టి గిన్నిస్ రికార్డు కొట్టేశాడు. రన్‌వే లేదు, ఏటీసీ లేదు, ల్యాండింగ్ మాత్రం నోట్లోనే! వందకు పైగా రికార్డులున్న ఈ "రికార్డుల రాజా", పిల్లల్లో సైన్స్ ఆసక్తి పెంచడానికే ఇవన్నీ చేస్తానంటాడు. మనమైతే నోట్లో కాగితం పడితే "ఛీ" అంటాం, ఈయన మాత్రం "గిన్నిస్" అంటాడు!

# భారత్ తడబాటు..
# చేతులెత్తేసిన టీమిండియా

**19.3 ఓవర్లలో 233 పరుగులు చేసిన టీమిండియా**
**ఆరంభంలో దూకుడు.. మధ్యలో కీలక వికెట్ల పతనం**
**ఐదు వికెట్లతో భారత బ్యాటింగ్ వెన్ను విరిచిన కీమో పాల్**
**నిరాశపర్చిన ఇషాన్, అయ్యర్, నమన్**
**బౌలింగ్‌లోనూ తేలిపోయిన భారత్**

భారీ లక్ష్యం.. ఆరంభంలో దూకుడు.. మధ్యలో కీలక వికెట్ల పతనం.. చివర్లో కీమో పాల్ విజృంభణ! ఇలా ఎన్నో మలుపుల మధ్య సాగిన నాలుగో టీ20లో భారత్‌కు ఓటమి తప్పలేదు. తొలుత షాయ్ హోప్ శతకంతో విరుచుకుపడటంతో వెస్టిండీస్ 247 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు పోరాడినా, కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో విజయం అందలేదు. కీమో పాల్ నాలుగు ఓవర్లలో 41 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టి భారత బ్యాటింగ్ వెన్ను విరిచాడు. దీంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లు రెండేసి విజయాలు సాధించాయి. బెంగళూరులో శనివారం జరగనున్న ఐదో మ్యాచ్ సిరీస్ డిసైడర్ కానుంది. 248 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు సంజూ శాంసన్ అదిరిపోయే ఆరంభం ఇచ్చాడు. అతడు కేవలం 23 బంతుల్లో 56 పరుగులు చేశాడు. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వేగంగా పరుగులు సాధిస్తూ భారత్ విజయంపై ఆశలు రేపాడు. అయితే కీమో పాల్ వేసిన ఓవర్‌లో శాంసన్ క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో భారత్‌కు తొలి ఎదురుదెబ్బ తగిలింది. ఇదే ఓవర్‌లో ఇషాన్ కిషన్ కూడా ఔటయ్యాడు. మూడు బంతులు ఎదుర్కొన్న అతడు ఆరు పరుగులే చేసి కీమో పాల్ బౌలింగ్‌లో జువెల్ ఆండ్రూకు క్యాచ్ ఇచ్చాడు. దూకుడుగా ఆడాల్సిన సమయంలో ఇషాన్ త్వరగా వెనుదిరగడం భారత్‌పై ఒత్తిడి పెంచింది. అభిషేక్ శర్మ 24 బంతుల్లో 29 పరుగులు చేశాడు. మూడు ఫోర్లు, ఒక సిక్సర్ బాదిన అతడిని గుడాకేశ్ మోటీ పెవిలియన్‌కు పంపాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 11 బంతుల్లో 16 పరుగులు చేసి శమర్ స్ప్రింగర్ బౌలింగ్‌లో జువెల్ ఆండ్రూకు క్యాచ్ ఇచ్చాడు. దీంతో భారత్ కీలక వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది.

### తెలుగు కుర్రాళ్ల పోరాటం

మధ్య ఓవర్లలో తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి భారత



ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టేందుకు ప్రయత్నించారు. తిలక్ దూకుడుగా ఆడుతూ సిక్సర్లతో స్కోరు వేగాన్ని పెంచాడు. అతడు 25 బంతుల్లో 45 పరుగులు చేశాడు. కానీ, షెపర్డ్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో పావెల్‌కు క్యాచ్ రూపంలో దొరికిపోయాడు. నితీశ్ కుమార్ రెడ్డి కూడా కీలక సమయంలో వేగంగా పరుగులు సాధించాడు. అతడు 20 బంతుల్లో 41 పరుగులు చేసి తిలక్ వర్మ తరహాలోనే భారీ షాట్ ఆడే ప్రయత్నం చేసి పావెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే చివరి ఓవర్లలో పరుగుల వేగం పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో భారత బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. భారీ షాట్లు ఆడే ప్రయత్నంలో వికెట్లు కోల్పోవడంతో విజయావకాశాలు దెబ్బతిన్నాయి.

### కీమో పాల్ ఐదు వికెట్ల విజృంభణ

చివరి ఓవర్లలో కీమో పాల్ భారత బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. వరుసగా వికెట్లు తీస్తూ ఛేదనను విండీస్ వైపు తిప్పాడు. నాలుగు ఓవర్లు వేసి 41 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. లక్ష్యం అందుకోవడం కష్టంగా మారడంతో భారత బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో క్యాచ్‌ల రూపంలో వికెట్లు సమర్పించుకున్నారు. చివరకు అర్ష్‌దీప్ సింగ్ రిటైర్డ్ హర్ట్ కావడంతో భారత్ ఇన్నింగ్స్ ముందుగానే ముగిసింది. భారత్ 19.3 ఓవర్లలో 223 పరుగులు చేసింది. భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో భారత బ్యాటర్లు చివరి వరకు పోరాడినా, కీమో పాల్ బౌలింగ్ ముందు నిలవలేకపోయారు.

### హోప్ శతకం.. విండీస్‌కు భారీ స్కోరు

అంతకుముందు టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అయితే వెస్టిండీస్ బ్యాటర్లు భారత బౌలర్లపై విరుచుకుపడ్డారు. కెప్టెన్ షాయ్ హోప్ 50 బంతుల్లో 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లు ఉన్నాయి. ఆరంభం నుంచి చివరి వరకు దూకుడుగా ఆడుతూ భారత బౌలర్లకు కష్టాలు తెచ్చిపెట్టాడు. జువెల్ ఆండ్రూ 16 బంతుల్లో 21 పరుగులు చేసి జట్టుకు మంచి ఆరంభం ఇచ్చాడు. అతడిని అక్షర్ పటేల్ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన షిమ్రోన్ హెట్‌మైర్ కేవలం 12 బంతుల్లో 33 పరుగులు చేశాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతడిని ప్రిన్స్ యాదవ్ క్యాచ్ అండ్ బౌల్డ్‌గా ఔట్ చేశాడు. రోవ్‌మన్ పావెల్ 17 బంతుల్లో 24 పరుగులు చేశాడు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో సంజూ శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరోవైపు షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ 26 బంతుల్లో 49 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. హోప్‌తో కలిసి చివరి ఓవర్లలో వేగంగా పరుగులు సాధించాడు. దీంతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లకు 247 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీశారు. మయాంక్ యాదవ్ నాలుగు ఓవర్లలో 52 పరుగులు ఇవ్వగా, అర్ష్‌దీప్ కూడా 52 పరుగులు సమర్పించుకున్నాడు. భారీ స్కోరును కాపాడుకోవడంలో విండీస్ బౌలర్లు విజయవంతమయ్యారు.

### భారత ఓటమికి కీలక కారణాలు

శాంసన్ దూకుడు, తిలక్ వర్మ-నితీశ్ రెడ్డి పోరాటం ఉన్నప్పటికీ భారత్ లక్ష్యాన్ని అందుకోలేకపోయింది. ఇషాన్ కిషన్ త్వరగా ఔటవడం, శ్రేయస్ అయ్యర్ కీలక సమయంలో పెవిలియన్‌కు చేరడం, మధ్య ఓవర్లలో వికెట్లు పడటం భారత ఛేదనను దెబ్బతీశాయి. మరోవైపు హోప్ శతకం, రూథర్‌ఫర్డ్ వేగవంతమైన ఇన్నింగ్స్ వెస్టిండీస్‌కు భారీ స్కోరు అందించాయి. చివర్లో కీమో పాల్ ఐదు వికెట్లతో భారత బ్యాటింగ్‌ను దెబ్బతీయడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు.

## స్పోర్ట్స్

### బెంగాల్, గుజరాత్ గెలుపు



**కోల్‌కతా :** రంజీ ట్రోఫీని బెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్ విజయంతో ప్రారంభించాయి. ఎలైట్ గ్రూప్ 'సీ'లో భాగంగా కోల్‌కతాలో ఢిల్లీతో జరిగిన పోరులో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన బెంగాల్.. ప్రత్యర్థిని 9 వికెట్ల తేడాతో చిత్తుచేసింది. ఎలైట్ గ్రూప్ 'సీ'లోని మరో మ్యాచ్‌లో మహారాష్ట్ర.. సర్వీసెస్‌ను 127 పరుగులతో ఓడించింది. ఇదే గ్రూపులో ఉన్న గుజరాత్ సైతం.. ఒడిశాపై 10 వికెట్ల తేడాతో గెలిచి టోర్నీలో బోణీ కొట్టింది. కాగా డిఫెండింగ్ చాంపియన్ జమ్మూకాశ్మీర్ మాత్రం తొలి మ్యాచ్‌లో డ్రాతో గట్టెక్కింది. శ్రీనగర్ వేదికగా మధ్యప్రదేశ్‌తో జరిగిన పోరులో ఆ జట్టు నిర్దేశించిన 325 రన్స్ ఛేదనలో జమ్మూకాశ్మీర్ ఆఖరి రోజు 88/7తో ఆటను ముగించింది. ఆంధ్రాతో జరిగిన మ్యాచ్‌ను కర్నాటక డ్రా చేసుకుంది. తమిళనాడు, పంజాబ్, సౌరాష్ట్ర, కేరళ తమ మ్యాచ్‌లను డ్రా చేసుకున్నాయి.

### కెరీర్ బెస్ట్ ర్యాంకుకు శ్రేయస్



**దుబాయ్ :** టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకున్నాడు. ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అతడు మూడు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. స్వదేశంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి పోరులో భారీ శతకంతో చెలరేగడంతో అతడి ర్యాంకు మెరుగైంది. దీంతో టాప్-4లో ఉన్న బ్యాటర్లలో ముగ్గురూ భారత ఆటగాళ్లే కావడం విశేషం. ఇషాన్ అగ్రస్థానాన కొనసాగుతుండగా అభిషేక్ సెకండ్ ప్లేస్‌లో ఉన్నాడు. పాకిస్థాన్ సారథి సాహిబ్‌జాదా ఫర్హాన్ మూడో స్థానం దక్కించుకోగా అయ్యర్ ఫోర్త్ ప్లేస్‌లో ఉన్నాడు.

# గ్లామర్ ప్రపంచంలో రాణిస్తున్న టాప్ -10 తెలుగమ్మాయిలు







గ్లామర్ రంగంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని వరుస చిత్రాలతో దూసుకుపోతున్న టాప్ తెలుగమ్మాయిలు తమ అద్భుతమైన ప్రతిభతో మైమరిపిస్తున్నారు. -బేబీ- చిత్రంతో భారీ విజయాన్ని అందుకుని ఒక్కసారిగా కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన వైష్ణవి చైతన్య.. తన సహజమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల ఆనంద్ దేవరకొండ సరసన నటించిన -ఎపిక్- చిత్రంతో మరోసారి నటిగా మంచి మార్కులే వేయించుకుంది. అలాగే -జాతిరత్నాలు- చిత్రంతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన ఫరియా అబ్దుల్లా తన హైట్.. ఎనర్జిటిక్ డ్యాన్సులు.. కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగా.. తాజాగా -గాయపడ్డ సింహం- వంటి చిత్రాలతో విభిన్న పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు.గ్లామర్ రోల్స్ తో పాటు యాక్షన్ ప్యాక్డ్ పాత్రలతోనూ ఆకట్టుకుంటున్న డింపుల్ హయతి, -ఖిలాడి-, -సామాన్యుడు-వంటి చిత్రాలలో తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇటీవల కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన -భర్త మహాశయులకు విజ్ఞప్తి- చిత్రంతో తన నటనలో కొత్త కోణాన్ని పరిచయం చేశారు. ఇక -పెళ్లిచూపులు- వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌తో ఓ ట్రెండ్ సెట్ చేసిన రీతు వర్మ.. అప్పట్నుంచీ గ్రేస్‌ఫుల్ పెర్ఫార్మెన్సెస్ ఇస్తూ వస్తున్నారు. టూ టౌన్, నిన్ను కోరి వంటి విజయాల తర్వాత ప్రస్తుతం -భారతవర్ష-వంటి భారీ ప్రాజెక్ట్‌లలో నటించారు.తనదైన నటన- సహజమైన అందంతో తెలుగు తెరపై ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఈషా రెబ్బ.. ఓం శాంతి శాంతి శాంతిహి అనే చిత్రంలో నటించడమే గాక 3 రోజెస్ అనే వెబ్ సిరీస్ లోను నటించారు. తదుపరి వస్తా నీ వెనుక (రమేష్ వర్మ దర్శకత్వం) చిత్రంలో నటించారు. ఈ ఏడాది డిసెంబర్ లో ఈ చిత్రం విడుదల కానుంది. అలాగేటైటిల్ లేని విక్రమ్ ప్రభు ప్రాజెక్ట్ ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. ఆయిరం జెన్మంగల్ (దర్శకుడు ఎజిల్) -- డిసెంబర్ లో విడుదల కానుంది. కంటెంట్ ఓరియంటెడ్ చిత్రాలు.. వెబ్ సిరీస్‌ల ద్వారా విపరీతమైన పాపులారిటీ తెచ్చుకున్న కామాక్షి భాస్కర్ల, తన డీప్ పెర్ఫార్మెన్సెస్‌తో మంచి నటిగా గుర్తింపు పొందారు. ఇటీవల విడుదలైన అగధ చిత్రంతోను కామాక్షి పేరు మార్మోగింది. తనదైన ఫియర్‌లెస్ యాటిట్యూడ్ తో ఆకట్టుకోవడం ఈ భామ ప్రత్యేకత.బిగ్‌బాస్ ద్వారా వెలుగులోకి వచ్చి... గ్లామర్ పాత్రలతో పాటు సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే దివి వద్యత పలు చిత్రాలలో కీలక పాత్రలు పోషిస్తూ తన కెరీర్‌ను మలుచుకుంటున్నారు. యూత్ ఫుల్ లవ్ స్టోరీలు .. డిజిటల్ కంటెంట్‌తో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న శ్రీ గౌరి ప్రియ, వరుస ప్రాజెక్ట్‌లతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక మార్క్ క్రియేట్ చేసుకుంటున్నారు. -పెదకాపు 1- వంటి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చి తన అభినయంతో ఆకట్టుకున్న శివానీ నాగరం ప్రస్తుతం కొన్ని క్రేజీ ప్రాజెక్ట్‌లలో ఆఫర్లు దక్కించుకుంటూ కెరీర్‌లో ముందుకు వెళ్తున్నారు. మరోవైపు ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ కిరీటాన్ని దక్కించుకున్న తెలుగమ్మాయి మానస వారణాసి గ్లామర్ ప్రపంచంలో తన అందచందాలతో పాటు సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యకలాపాలతోనూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com